తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల   కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
24 ఏప్రిల్ 2026
పేజీలు : 8
Follow :

## పిల్లల ఎదుగుదలను నిరంతరం పరిశీలన చేయాలి

❍ సంక్షేమ శాఖ పని తీరు పై సమీక్ష చేసిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,ఏప్రిల్ 23(జనంసాక్షి) :** పిల్లల ఎదుగుదలను నిరంతరం పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంక్షేమశాఖ పని తీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్వైజర్లు క్రమం తప్పకుండా సందర్శించాలని, నమోదు చేసిన ప్రతి చిన్నారి హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాజరు మెరుగుపరచడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తూ, పోషణ స్థాయిని మెరుగుపరచాలని సూచించారు.ఇండస్ట్రియల్ ప్రాంతాలు, ఇటుక భట్టీలు (బ్రిక్ కిల్న్‌లు) వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లల వివరాలను సేకరించాలని, ఆ ప్రాంతాల్లో పిల్లలకు అవసరమైన సౌకర్యాలను గుర్తించి పరిశ్రమల ద్వారా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పిల్లల సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ముఖ్యంగా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఎక్కువ కేసులు అధికారుల దృష్టికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌ఓ కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

❍ కలెక్టర్ కోయ శ్రీ హర్ష
❍ జీత బిల్లులు ప్రాసెస్ చేయడానికి నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు



**పెద్దపల్లి,ఏప్రిల్ 23(జనంసాక్షి) :**
జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డి ఎం అండ్ హెచ్ ఓ) కార్యాలయంలో సూపరింటెండెంట ్గా విధులు నిర్వహిస్తున్న శ్రీ ఎం.డి. అజీమ్ ఖాన్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ శ్రీ ఓ. రాము ను సస్పెండ్ చేస్తూ లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి ఉత్తర్వులు జారీ చేశారు.పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కొత్తగా నియమితులైన ల్యాబ్ టెక్నీషియన్ల జీతాలు ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో ప్రాసెస్ చేయడం కోసం సంబంధిత అధికారులచే నగదు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ నిర్వహించగా, సూపరింటెండెంట్ ఎం.డి. అజీమ్ ఖాన్ మరియు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము జీత బిల్లులు సిద్ధం చేయడం, ప్రాసెస్ చేయడం విషయంలో అక్రమాలు, అధికార దుర్వినియోగం చేసినట్లు తేలినట్లు పేర్కొన్నారు. విచారణలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్ల నుంచి నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో పాటు, సంబంధిత వివరాల్లో అవకతవకలు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ వెల్లడించారు.అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల పరిశీలన మేరకు,సూపరింటెండెంట్ ఎం.డి.అజీమ్ ఖాన్ మరియు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము ను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారులు ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని,నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించబడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సన్న వడ్లకు బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే

○ రైతులు ఎవరు అధైర్య పడొద్దు ○చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం
○రెండు లక్షల రైతు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే
○ గింజ కటింగ్ లేకుండా కొనుగోలు ○ ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**సుల్తానాబాద్,ఏప్రిల్ 23(జనంసాక్షి) :**
రైతులకు కాంగ్రెస్,ప్రభుత్వం అండగా నిలిచి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని, సన్న వడ్లకు బోనస్ ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని, రైతు రుణమాఫీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శాస్త్రి నగర్, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్, కదంభాపూర్, సుద్దాల, రేగడి మద్దికుంట గ్రామాలలో సింగిల్ విండోల ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాలను ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండలంలో 1500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారని తెలిపారు. మండలంలో

మిగతా 7లో

## "బోధన్ రైల్వే స్టేషన్‌కు మహర్దశ గూడ్స్ యార్డ్ పునర్నిర్మాణానికి బ్లూప్రింట్ సిద్ధం"

**బోధన్ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన హైదరాబాద్ డీ.ఆర్.ఎం. సంతోష్ కుమార్ వర్మ**



**బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి ) :**
హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ (డీ.ఆర్.ఎం) సంతోష్ కుమార్ వర్మ గురువారం బోధన్ రైల్వే స్టేషన్‌లో సమగ్రమైన ఉన్నత స్థాయి తనిఖీని నిర్వహించారు. సాంకేతిక నిపుణులు మరియు వివిధ విభాగాల అధిపతుల బృందంతో కలిసి వచ్చిన డి.ఆర్.ఎం, స్టేషన్ మౌలిక సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యాలు, గూడ్స్ యార్డ్ పనితీరు మరియు భద్రతా అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. స్టేషన్ యొక్క కార్యాచరణ సంసిద్ధతను అంచనా వేయడం మరియు గూడ్స్ యార్డ్ కోసం వ్యూహాత్మక పునర్నిర్మాణ ప్రణాళికను రూపొందించడం ఈ పర్యటన యొక్క ప్రధాన ఉద్దేశ్యం. డివిజన్ యొక్క సరఫరా గొలుసు సామర్థ్యాలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో, సరుకు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం కోసం అధికారులు ప్రస్తుతం ఉన్న ట్రాక్ లేఅవుట్‌లను మరియు అందుబాటులో ఉన్న భూమిని పరిశీలించి బ్లూప్రింట్‌ను సిద్ధం చేశారు. ఈ చొరవ ద్వారా నిత్యావసర వస్తువుల రవాణాను క్రమబద్ధీకరించడం మరియు ఈ ప్రాంతంలోని స్థానిక పరిశ్రమలు, వ్యవసాయ వాణిజ్యానికి బోధన్‌ను కీలకమైన లాజిస్టిక్స్ నోడ్‌గా మార్చడం లబోధన్య్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పి.టి.వి. దుర్గా ప్రసాద్, బి. హేమ నాయక్, ఆర్. ప్రశాంత సాయి కృష్ణ, కె. విజయ్ కుమార్, శశాంక్ నామ్‌దేవ్, ఎమ్. లక్ష్మీనారాయణ, వి. విద్యాధర్, అనిరుధ్ పమార్ వై. సృజన్ కుమార్ ఇతరులు ఉన్నారు.

## కరీంనగర్‌లో శ్రీ వాసవి జయంతోత్సవాలకు ఆహ్వానం ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు పత్రిక అందజేత

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 23 ( జనంసాక్షి)**
కరీంనగర్: ఈనెల 26వ తేదీన ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించనున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతోత్సవ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ వాసవి ట్రస్ట్ సభ్యులు నేడు కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వాసవి ట్రస్ట్ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు మరియు ఆర్యవైశ్యుల ప్రతినిధులు కలిసి జయంతోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసి వేడుకలను విజయవంతం చేయాలని ఆయనను ఆహ్వానించారు.అలాగే ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను శాలువాతో సత్కరించి గౌరవించారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే ఈ జయంతోత్సవాలు భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వాసవి ట్రస్ట్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



# ముత్తారంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ముత్తారం ఏప్రిల్ 23(జనంసాక్షి ):** వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అక్కడి నిర్వాహకులు చూసుకోవాలని కమాన్ పూర్ మార్కెట్ కమిటి చైర్మెన్ వైనాల రాజు అన్నారు.గురువారం ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో ఐకెపి,పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజి తో కలసి ప్రారంబించారు.ఈ సందర్భంగా మార్కెట్ చైర్మెన్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రైతులు ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో కొనుగోలు కేంద్రాల వద్దకు రావాలని సూచించారు.ధాన్య కొనుగోళ్ళ విషయంలో రైతులను అక్కడి నిర్వాహకులు,మిల్లర్లు ఇబ్బందులు పెడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.రైతులను ఇబ్బందులు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు,రైతులు సమన్వయంతో పని చేస్తూ,ఒక మంచి వాతావరణంలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ శాలలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మెన్ మద్దెల రాజయ్య,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బియ్యని శివకుమార్,సర్పంచ్లు మెంగని సమత తిరుపతి,రాపెల్లి రాజయ్య,పెగడ తిరుమల కుమార్,అన్నపూర్ణ ఉపేందర్, రాజేశ్వరి రాజయ్య,పోతిపెద్ది కవిత,అత్తే చంద్రమౌళి,గడ్డం రాజేశం,తాని ప్రభాకర్,ఊట్ల చరణ్,పిఏసిఎస్ సివో దాసరి ప్రసాద్,ఐకేపీ ఎపిఎం స్వరూప తోపాటు ఉపసర్పంచ్ లు వార్డు సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గుండ్లపల్లిలో విద్యుత్ శాఖ అధికారుల పల్లెబాట

**గన్నేరువరం, ఏప్రిల్ 23 (జనంసాక్షి):** నుస్తులపూర్ సబ్ డివిజన్ మండలం లోని గన్నేరువరం సెక్షన్ పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు గురువారం పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు వాడాలని సూచించారు. ఇంటికి ఎర్తింగ్ చేసుకోవాలని, ఫ్రిజ్‌లు, కూలర్లు ప్రతి ఒక్కదానికి ఎర్తింగ్ చేయించాలన్నారు. ఎర్తింగ్ చేసుకుంటే ప్రమాదాలను అరికట్టవచ్చున్నారు. ఇంటికి నాణ్యమైన సర్వీస్ వైరు, డీపీ మెయిన్ స్విచ్ ఫ్యూజ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ ఫిర్యాదులుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమంలో డిఈ ఉపేందర్, గన్నేరువరం ఏఈ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



# రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రులు నిర్వహించకూడదు

## డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రమోద్ కుమార్

**గోదావరిఖని, జనంసాక్షి :** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశాల మేరకు రామగుండం టౌన్ పరిధిలోని కంటి ఆసుపత్రులను ఈ మధ్య కాలంలో తనిఖీ చేశారని జిల్లా వైద్య.. ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా రెండు ఆసుపత్రులకు అనుమతి పత్రాలు లేనట్టు గుర్తించడం జరిగిందన్నారు. వీరికి నోటీసు లు జారీచేశామని, ఆప్టికల్ దుకాణాలు కంటి పరీక్షలు నిర్వహించరాదని అన్నారు. కేవలం డాక్టర్ ప్రిస్క్రైబ్ చేసిన అద్దాలను మాత్రమే ఇవ్వాలి అని అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్-2010 ప్రకారం అన్ని ఆసుపత్రులు, కంటి క్లినిక్స్, దయాగ్నొస్టిక్ కేంద్రంలు, క్లినిక్ లు, స్కానింగ్ కేంద్రాలు, ఫిజియోథెరపీ కేంద్రాలు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అని అన్నారు. రిజిస్ట్రేషన్ లేని వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు.



# ఆర్జీ.వన్ ఏరియాలో ఎయిర్ కూలర్స్ ఏర్పాటు చేయాలి

## ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లో పని చేస్తున్న కార్మికుల కు వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మైన్స్, డిపార్టుమెంటు ల పైన ఎయిర్ కూలర్ లు మార్చి నెల నుండి ఏర్పాటు చెయ్యాల్సి ఉండగా యాజమాన్యం రెండు నెలలు గడిచినా ఇంత వరకు ఏర్పాటు చేయక పోవడం పై కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏఐటియుసి గుర్తింపు సంఘం గా గనులు, డిపార్మెంట్ ల పై ఎయిర్ కూలర్ లు ఏర్పాటు చేయాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా, ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని , దీనిని ఏఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందని, వెంటనే ఎయిర్ కూలర్స్ ఏర్పాటు చెయ్యాలని యాజమాన్యాన్ని ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను డిమాండ్ చేశారు . లేని పక్షం లో కార్మికుల నుండి ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు .

# నలందలో అకాడమిక్ ఎక్సెలెన్స్ అవార్డుల ప్రదానం

**ఆర్మూర్,ఏప్రిల్ 23(జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో హై అకాడమిక్ ఎక్సెలెన్స్ అవార్డుల ప్రధానం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీ మేధా స్పోకెన్ ఇంగ్లీష్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వరంగల్ డైరెక్టర్ డాక్టర్ చిరంజీవి ని ఆహ్వానించారు.పాఠశాల యజమాన్యం,అతిథులు,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ కలిసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ విద్య సంవత్సరం విద్యార్థుల యొక్క నైపుణ్యం వివిధ రంగాలలో హ్యాండ్ రైటింగ్,డిసిప్లిన్,కాన్స్టంట్ పెర్ఫార్మన్స్,రీడింగ్ స్కిల్స్,క్రమశిక్షణ,డే బై డే ఇంప్రూవ్మెంట్,బెస్ట్ పెర్ఫార్మెన్స్,అటెండెన్స్,ఐఐటి, ఒలంపియాడ్,అబాకస్ వంటి కాంపిటేటివ్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డాక్టర్ చిరంజీవి,విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు.ప్రతి సంవత్సరం ఒక్క విద్యార్థిని సెలెక్ట్ చేసి వారికి విద్యస్థాయి నైపుణ్యాలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు,విద్యార్థుల యొక్క ప్రతి టాలెంట్ ను గుర్తించి వారికి సర్టిఫికెట్లు,ప్రశంస పత్రాలను,మెడల్స్ ను బహుకరించారు.ఈ విద్యా సంవత్సరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సాగర్ మాట్లాడుతూ విద్యా ప్రాముఖ్యతను,విద్యార్థులు ఆయా రంగాలలో సాధించిన విజయాలను కొనియాడారు. విద్యార్థుల యొక్క కృషికి అహర్నిశలు కష్టపడినా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.వచ్చే సంవత్సరం నలంద స్కూల్లో అబాకస్, ఐఐటి, ఒలంపియాడ్ చేతివ్రత మెరుగుపరుచుటకు లూసిదా,ఇంకా మెరుగైన విద్య కొరకు కొత్త సంవత్సరానికి కొత్త ఆలోచనతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమానికి విచ్చేసిన మేద చిరంజీవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ తాడూరి కరుణాశ్రీ

**గన్నేరువరం, ఏప్రిల్ 23 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలోని జంగపల్లి గ్రామంలో గురువారం ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ తాడూరి కరుణాశ్రీ, ఉప సర్పంచ్ మాంకాళీ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లచ్చువ్వ, ప్రదీప్, ఆంజనేయులు,ఎల్లయ్య, అనూష, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వర్కోల్ వెంకటి, సిఏలు అంజలి, సువర్ణ, విజయ, ఏఈఓ అనూష, శ్రీనివాస్, ఆంజనేయులు,అమాలి సంపత్,మహేష్,సుమన్, పాల్గొన్నారు.



# కథలాపూర్ మాస్ట్రో స్కూలుకి నేషనల్ అవార్డు

**కథలాపూర్, ఏప్రిల్ 23(జనం సాక్షి )** కథలాపూర్ మండలానికి చెందిన ప్రముఖ విద్య సంస్థ అయిన మాస్ట్రో పాఠశాలకు నేషనల్ అవార్డు రావడం గర్వకారణంగా ఉందని పాఠశాల చైర్మన్ ఆకుల రాజేష్ తెలియజేశారు. లీడ్ సంస్థ సీఈవో అమిత్ మిశ్రా చేతుల మీదుగా నేషనల్ విన్నర్ అవార్డులు పాఠశాల చైర్మన్ ఆకుల రాజేష్ ప్రిన్సిపల్ ఆకుల రంజిత్ అందుకోవడం జరిగింది. మాస్ట్రో పాఠశాలకు నేషనల్ రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం నికి అభినందనలు తెలియజేశారు.




# నేడు షెడ్యూల్డు కులముల సంక్షేమ పథకం లోన్లు కోసం ఇంటర్వ్యూ



**గన్నేరువరం, ఏప్రిల్ 23 (జనంసాక్షి):** గన్నేరువరం మండల ప్రజా పరిషత్ షెడ్యూల్ కులముల యొక్క 2025-26 ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక -- షెడ్యూల్డు కులముల సంక్షేమ పథకములకు లోన్లు మంజూరీ చేయుట కొరకు తేది 24.శుక్రవారం రోజున ఉదయము 11:00 గం.లకు గన్నేరువరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుందని ఎంపీడీఓ ఏ.శ్రీనివాస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎమ్మెల్యే..కార్పొరేటర్లు..అధికారులు.. చేస్తున్న

**ప్రయత్నానికి ప్రజలు సహకరించాలి**

**రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి**



**గోదావరిఖని, జనంసాక్షి :**రామగుండం నగరానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు ఎం ఎల్ ఎ , కార్పొరేటర్లు, అధికారులు చేస్తున్న ప్రయత్నానికి ప్రజలు సహకారం అందించాలని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా గురువారం 38 వ డివిజన్ మల్లిఖార్జున్ నగర్ లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ నెలకంటి రాముతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని నవ నిర్మాణం చేస్తూ సుందరంగా తీర్చిదిద్దడానికి ఎం ఎల్ ఎ చేస్తున్న కృషికి తోడు అందరం స్వచ్ఛందంగా భాగస్వాములై స్వచ్ఛ రామగుండంగా మార్చుకుందామని అన్నారు. కేవలం రూ 50/- స్వల్ప వ్యయంతో ఇంటిముందుకువచ్చి నెలంతా చెత్త తీసుకువెళ్ళే సౌకర్యాన్ని నగర పాలక సంస్థ కల్పిస్తుంటే సమీపంలోని కాలువల్లో , రోడ్లపై వేయడం సరికాదని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయడం వలన దోమలు , ఈగలు , పందులకు ఆవాసమై అంటువ్యాధులు వ్యాప్తి చెంది అనారోగ్యానికి దారి తీసి ప్రాణాంతకంగా పరిణమిస్తే ఆతరువాత లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం ఉండదని అన్నారు. గతంలోలా కాకుండా ప్రజలకు ఏమి అవసరమో అదే చేస్తున్నామని అన్నారు. అవినీతికి తావు లేకుండా పార దర్శకంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. నాలా లో పూడిక తీత పనులకు గతంలో మాదిరిగా లక్షల రూపాయలు వృధా చేయకుండా మునిసిపల్ వాహనాలు , మునిసిపల్ సిబ్బంది సేవలను ఉపయోగించుకుంటున్నామని అన్నారు. కాగా ఈ సంధర్భంగా 38 వ డివిజన్ పరిధిలోని మేజర్ నాలా పూడిక తీత పనులను మేయర్ పర్యవేక్షించారు . రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి చెట్లు , పొదలు, గుబుర్లు తొలగించారు . పెద్ద చెట్ల కొమ్మలు కత్తిరించారు. దీంతో ఇరుకుగా ఉన్న రహదారి గతంతో పోలిస్తే విశాలంగా మారిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు , రోడ్డు కు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు అంగన్ వాడీ భవనానికి కేటాయించిన స్థలంలో లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ లను కూడా ప్రక్కకు తరలించాలని ట్రాన్స్ కో అధికారులకు ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన పోట్టి స్తంభాలను తొలగించి వాటి స్థానంలో పొడవైన కొత్త స్తంభాలు వేయాలని కూడా ఆదేశించారు. మేజర్ నాలా లలో పూడిక తొలగించడానికి వాహనాలు దిగడానికి వీలుగా అక్కడక్కడ ర్యాంప్ లు కూడా ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్ లతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ . ఇ . గురువీర , ఇ . ఇ, పి వి రామన్ , డి , ఇ , ఇ అఫ్రాజ్ , ఎ .ఇ .లు జమీల్ , అన్వేష్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కోయ శ్రీహర్ష ద్వారా సౌండ్ బాక్స్ పాఠశాలకు అందజేత



**అంతర్గాం, జనంసాక్షి :**ప్రవాస భారతీయుడు గుడిమల్ల శ్రీనివాస్ 20వేల రూపాయల విలువగల సౌండ్ బాక్స్ వైర్లెస్ స్పీకర్స్ స్కౌట్ మాస్టర్ అక్కపాక రాజమౌళి ద్వారా ఎలకలపల్లి పాఠశాలకు అందించారు.స్కౌట్ మాస్టర్ అక్కపాక రాజమౌళి అభ్యర్థన మేరకు ఎలకలపల్లి పాఠశాలకు 20వేల రూపాయల విలువగల సౌండ్ బాక్స్ వైర్లెస్ స్పీకర్స్ ను స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ ద్వారా తల్లిదండ్రుల సమక్షంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్కౌట్ మాస్టర్ అక్కపాక రాజమౌళి ద్వారా అందించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పాఠశాలకు అందజేసిన గుడిమల శ్రీనివాస్ ను అభినందిస్తూ, స్కౌట్ మాస్టర్ రాజమౌళిని కూడా అభినందించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులను చేరేలా ప్రోత్సహించాల్సిందిగా కోరారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానం చేసి జ్ఞాపకను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శారద, మండల విద్యాధికారి విమల, జి సి డి ఓ కవిత, ఎలకలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ,,గ్రామ సర్పంచ్ అంజి బాబు, ఉప సర్పంచ్ గరెపల్లి రమాదేవి, వార్డు సభ్యులు మేకల సతీష్ ,గుంటూరు పల్లి గ్రామ సర్పంచ్ యర్రం హరినాథ్ రెడ్డి, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పది గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభ



**మంథని, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని పది గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. మంథని మండలంలోని పుట్టపాక, అక్కేపల్లి, నగరంపల్లి, మహబూబ్ పల్లి, మల్లేపల్లి, పోతారం, నాగారం, కన్నాల, గుంజపడుగు, సిరిపురం వరి ధాన్యం కేంద్రాలను సర్పంచులు కన్నూరి రాజబాపు, పెయ్యల సంధ్య – సురేష్, నాతరి లత – శ్రీనివాస్, లక్కాకుల సత్యనారాయణ, ఎడ్ల ఆదిత్య, బెల్లంకొండ శ్రీదేవి – సత్యనారాయణ రెడ్డి, గుడిసె గట్టయ్య, దండవేన సంధ్య – భావేష్, గోదారి లక్ష్మీ లు ప్రారంభించారు. రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, ఏ ఎం సి వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, నాయకులు పేరవేన లింగయ్య, ఊదరి శంకర్, కుంట రాజు, రాం రాజశేఖర్, బూడిద శంకర్, ఎడ్ల శ్రావణ్, కన్నూరి సుదర్శన్, చాట్లపల్లి మధు, సంతోష్, ఆకుల సురేష్, అయిలి సతీష్, పోరెడ్డి జ్ఞానప్రసన్న – తిరుపతి రెడ్డి, నౌండ్ల సదానందం, కన్నూరి రజిత – సంతోష్, గువ్వల ప్రశాంత్, కొప్పూరి శైలజ, గొఫ్కి శంకర్, ఎరుకల మోహన్ సాయి, ఎడ్ల సత్యనారాయణ, దాసరి గట్టయ్య, దాసరి లక్ష్మీ, ఎరుకల లలిత – వెంకటస్వామి, భాస్కర్ రెడ్డి, పోయిల రాజయ్య, గాదె దివ్య, కావటి రజిత, గాదె సంజీవ రెడ్డి, పాపిరెడ్డి, సంతోష్ రెడ్డి, గుర్రాల రాజలింగు, బొల్లి శంకర్, సమ్మయ్య, మిటుకు రామ్మూర్తి,గోదారి మహేందర్, రైతులు, ప్రజాప్రతినిధులు, హమాలీ సంఘం నాయకులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు రుద్రంగి పోలీస్‌స్టేషన్ నూతన భవనానికి భూమిపూజ



**రుద్రంగి ఏప్రిల్ 23 (జనం సాక్షి)**రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో శుక్రవారం రోజున నూతన పోలీస్‌స్టేషన్ భవనానికిభూమిపూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేడు జరగబోయే భూమిపూజ కార్యక్రమ ఏర్పాట్లను అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ శ్రీనివాసులు,సిఐ వెంకటేశ్వర్లు,ఎస్ఐ మోతిరామ్ పరిశీలించారు.భూమిపూజ సందర్భంగా చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనులను అలాగే భూమి చదును చేసే ఏర్పాట్లను పరిశీలించారు.2 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంజూరు చేయడం జరిగింది.ఇట్టి భూమిపూజ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ,మరియు పోలీస్ శాఖ ఉన్నత అధికారులు,పాల్గొననున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, ఉపసర్పంచ్ అభిలాష్, ఎర్రం గంగా నరసయ్య,పల్లి గంగాధర్, దయ్యాల శ్రీనివాస్,అక్కనపెల్లి శ్రీనివాస్, శీలం పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన బిజెపి



**మంథని, ( జనంసాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఎలక్షన్ల ముందు ఇచ్చినటువంటి హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంథనిలోని బస్ డిపో ఎదురుగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్నటువంటి రెండవ రోజు సమ్మెకు మంథని భారతీయ జనతా పార్టీ వారికి సంపూర్ణమద్దతు తెలిపారు. మండుటెండలో సమ్మెలో పాల్గొన్న కార్మిక సోదర సోదరీమణులకు మజ్జిగ ప్యాకెట్ పంపిణీ చేసి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మంథని మండల అధ్యక్షులు వీరబోయిన రాజేందర్ తో పాటు పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్ లో అక్షరాభ్యాసం, అన్నప్రాసన



**మంథని, ( జనం సాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట గ్రామంలో అంగన్వాడి సెంటర్ లో గురువారం చిన్నారులకు అన్నప్రసన్న, అక్షరభ్యాసము, గ్రాడ్యుయేషన్ డే, పోషక పక్షం బాలమేల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పల్లె నారాయణ పాల్గొని చిన్నారులకు తమ చేతుల మీదుగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. తల్లులకు పోషకాహారం శుభ్రత పిల్లల ఆరోగ్యం గురించి వివరించారు బాలమేళా కార్యక్రమంలో చిన్నారులు పాటలు, నృత్యాలు, ఆటలు ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. పిల్లల ప్రతిభను వెలికి తీసేలా టీచర్లు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చొప్పరి శేఖర్, వార్డు సభ్యులు దొంతుల అఖిల్, పోలవేన రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక తో పాటు సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, మహిళ సంఘం , పిల్లలు పాల్గొన్నారు.

## బేతాళస్వామి జాతరలో భక్తులకు చల్లని సేవలు

### ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**బాన్సువాడ ఏప్రిల్ 23 (జనం సాక్షి )**బేతాళస్వామి జాతర సందర్భంగా భక్తులకు ఉపశమనం కలిగించేలా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ (పాత బాన్సువాడ) ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. జాతరకు విచ్చేసిన భక్తుల దాహార్తిని తీర్చేందుకు గత 16 సంవత్సరాలుగా నిరంతరం ఈ సేవ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని సంఘ సభ్యులు తెలిపారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు చల్లని తాగునీరు అందిస్తూ సేవాభావంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భక్తులు ఈ సేవను అభినందిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాము, రమేష్ యాదవ్, షేక్ మంజూర్, కాశీనాథ్, సురేష్, విజయ్, నాగరాజు, క్రాంతి కుమార్, సుధాకర్, కుమార్, పవన్, అశోక్, అరవింద్, మంగళి భాస్కర్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు నిర్వాహకులకు పట్టు వస్త్రాలు అందించిన ఏళ్ల బాల్ రెడ్డి

**ముస్తాబాద్ ఏప్రిల్ 23 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండల కేంద్రంలో పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద దబ్బెడ లావణ్యచంద్రం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోని గృహప్రవేశం చేయడం జరిగింది. ఈ గృహప్రవేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఇందిమ్మ ఇల్లు నిర్మాకులకు పట్టు వస్త్రాలు సమర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వివిధ అభివృద్ధి పథకాలతో పాటు గూడు లేని నిరుపేదలకు గూడు నిర్మిస్తూ ఒక పెద్దన్నగా రేవంతన్న ప్రభుత్వం నిరుపేద గుండెల్లో నిలిచిపోయింది. మండలంలో చాలామంది నిరుపేదలు నూతన ఇల్లు నిర్మించుకొని గృహప్రవేశాలు చేసుకోవడం జరిగింది. మళ్లీ రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది



# అంగన్వాడీ కేంద్రంలో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే

**కథలాపూర్, ఏప్రిల్ 22(జనం సాక్షి )** కథలాపూర్ మండలంలోని చింతకుంట గ్రామంలో బుధవారం రోజున అంగన్వాడీ ప్రీ ప్రైమరీ ద్వారా పిల్లల సమగ్రాభివృద్ధి అంగన్వాడీ ప్రీ ప్రైమరీ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పిల్లల అభివృద్ధి కార్డ్ లను సర్పంచ్ నాగం భూమయ్యా తల్లులకు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సూపెర్వైసర్ స్రవంతి మాట్లాడుతూ బట్టి విధానంలో విద్య అందించడం ద్వారా పిల్లల అభివృద్ధి జరగదు. అంగన్వాడీ కేంద్రం లో పిల్లలకు ఆటలు,పాటలు,కథల ద్వారా,మంచి అలవాట్లు నేర్పిస్తూ,మంచి పోషకాహారం అందిస్తూ మంచి విద్యను అందిస్తున్నారని అందరూ అంగన్వాడీ సేవలను వియోగించుకోవాలని చెప్పారు. పోషణ పక్వాడలో బాగంగా సీమంతలు,అక్షరాభ్యాసం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింబాద్రి,ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ స్కూల్ టీచర్స్ , అంగన్వాడీ టీచర్లు అమృత,యశోద,స్వరూప,సంధ్య, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



# సెర్ఫ్ కార్యక్రమాలపై డిఆర్డిఓ జిల్లా స్థాయి సమీక్ష

**మంథని, ( జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివరాహ మండల సమైక్య కార్యాలయంలో గురువారం పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన సెర్ఫ్ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమీక్ష సమావేశంలో పెద్దపల్లి జిల్లా డిఆర్డిఓ కాళిందని పాల్గొని బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, ఎఫ్ఎంఎఫ్ఎంఈ, ఉద్యమ రిజిస్ట్రేషన్, సర్ఫ్ కార్యక్రమాలపై రివ్యూ చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ డిఆర్డిఓ తో పాటు జిల్లా స్థాయి అధికారులు, జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఏపిఎంలు, సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు. అనంతరం కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలో సెర్ఫ్, అలీప్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మహిళలకు కుట్టు నైపుణ్యాల గురించి తెలియజేశారు. అలాగే గుండారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.



# సివిల్ ఇంజినీర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం




**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23 ( జనం సాక్షి)** నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో కరీంనగర్ కన్సల్టెంట్ సివిల్ ఇంజినీర్స్ కరీంనగర్ సెంటర్ 2025--2027 నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెక్రటరీ జనరల్ ఆడెపు కాశీరాం హాజరై, నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యవర్గంలో చైర్మన్గా నల్ల లక్ష్మయ్య, సెక్రటరీగా సబ్బని శ్రీనివాస్, కోశాధికారిగా కోమటి వేణు మాధవ్ బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా భీమనాథుని రంజిత్ కుమార్, ప్రశాంత్, శ్రవణ్, రాజగోపాల్ నియమితులయ్యారు. సహ కార్యదర్శిగా అనిల్, సహ కోశాధికారిగా ప్రమోద్ బాధ్యతలు చేపట్టారు. వైస్ చైర్మన్లుగా అన్వర్, ఎల్ రాజు, జి.వి. కిషన్, జగన్ప్రణయ్, స్మరణ్ ఎన్నిక కాగా, ముఖ్య సలహాదారులుగా పాక పవనకృష్ణ, కోల అన్నారెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సివిల్ ఇంజినీర్ల పాత్ర సమాజ అభివృద్ధిలో కీలకమని, నూతన కార్యవర్గం ఇంజినీర్ల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్తో పాటు వరంగల్, సిద్దిపేట, పెద్దపల్లి, నల్గొండ, జగిత్యాల, సిరిసిల్ల, మెట్ పల్లి, కోరుట్ల ప్రాంతాలకు చెందిన ఇంజినీర్లు పాల్గొన్నారు.

# ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ సునీత



**ముస్తాబాద్ ఏప్రిల్ 23 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామంలో ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ చిట్టి సునీత వెంకట నరసింహారావు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ముస్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నరసయ్య హాజరై సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారుల మాట నమ్మి మోసపోవద్దు రైతులు సమయపాలన పాటిస్తూ ప్రతి ఒక్క రైతు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది కొనుగోలు సెంటర్ల వద్ద మంచినీళ్లు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల అధ్యక్షులు ఏల్ల బాల్ రెడ్డి ముస్తాబాద్ ఎమ్మార్వో ఫారుక్, ఆర్ఐ రఘు సిఏ పద్మా, ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ తాళ్ల విజయ్ రెడ్డి , మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ గూడూరు గ్రామ శాఖ అధ్యక్షులు చాకలి బాబు గూడూరు వార్డ్ మెంబర్లు కాసులవాద శీను, పుల్లూరి సంతోష్ ,వంగూరి లావణ్య , హమాలీ సంఘం అధ్యక్షులు పుల్లూరు కిషన్, గ్రామ రైతులు యూత్ నాయకులు వంగూరు దిలీప్ ,కసులవాద శ్రీకాంత్ మహేష్ మధు వెంకటేష్ నాంపల్లి వెంకటేష్ తుది నాయకులు పాల్గొనడం జరిగింది

# ఆప్షన్ సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్ విడుదల మే 1లోగా దరఖాస్తులు ఆహ్వానం




**బాన్సువాడ ఏప్రిల్ 23 (జనం సాక్షి )** బాన్సువాడ పురపాలక సంఘం మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కలిగిన కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం నలుగురు సభ్యులను ఎంపిక చేయనున్నారు. జీవో ఎంఎస్ నం.57, 58 తేదీ 16.03.2020 ప్రకారం ఇద్దరు ప్రత్యేక పరిజ్ఞానం/అనుభవం కలిగినవారిలో నుండి, మరో ఇద్దరు అల్పసంఖ్యాక వర్గాల నుండి ఎంపిక చేయబడతారు. ప్రతి విభాగంలో ఒకరు మహిళా సభ్యురాలు ఉండడం తప్పనిసరి. ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన సభ్యుల కోసం మున్సిపల్ కౌన్సిల్ ఓటరు జాబితాలో పేరు నమోదు అయి ఉండాలి, వయసు 21 సంవత్సరాలు నిండాలి. మున్సిపల్ లేదా గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం లేదా కనీసం 5 సంవత్సరాల సేవ ఉండాలి. అదేవిధంగా మున్సిపల్ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడిగా లేదా ప్రభుత్వ స్థానిక సంస్థల్లో గెజిటెడ్ ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయిన వారూ అర్హులు. అల్పసంఖ్యాక వర్గాల సభ్యుల ఎంపికకు అభ్యర్థులు మున్సిపల్ ఓటరు జాబితాలో నమోదు అయి ఉండాలి, 21 సంవత్సరాల వయస్సు పూర్తై ఉండాలి, సంబంధిత వర్గానికి చెందిన వారై ఉండాలి. అర్హతలు కలిగిన వారు తమ దరఖాస్తులతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి మే 1, 2026 సాయంత్రం 5 గంటల లోపు బాన్సువాడ పురపాలక సంఘం కమిషనర్ కార్యాలయానికి సమర్పించాలని కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గుంజపడుగు సర్పంచ్

**మంథని, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామంలో మంథని పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్య - బానేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మామిడాల అశోక్ కుమార్, వార్డు సభ్యులు భోగే సంపత్ , భోగి రాజేశ్వరి ,ఉప సర్పంచ్ ఎల్క లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ ఊదరి శంకర్ , మీట్కు రామ్మూర్తి, బొల్లి సమ్మయ్య , బోల్లి శంకర్ రైతులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం వడ్లు బాగా పండి రైతులకు అధిక లాభాలు రావాలని సర్పంచ్ దండేవేన సంధ్య - బానేష్ సందర్భంగా ఆకాంక్షించారు.



# పేదోడి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**మంథని, ( జనంసాక్షి ) :** పేదోడి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. అని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ అన్వర్ లు అన్నారు. గురువారం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో కుందారపు కవిత-శ్రవణ్ ఇందిరమ్మ ప్రారంభోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కుందారపు కవిత-శ్రవణ్ లు ధన్యవాదాలు తెలియజేసారు. సందర్భంగా వారు మాట్లాడుతూ...పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రొంపికుంట గ్రామంలో 208 ఇండ్లను మంజూరు చేశాం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఇండ్లను మంజూరు చేసిందని, ఈ ఇండ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే అదనంగా ఇంకా ఇండ్లు మంజూరు అవుతాయని పేర్కొన్నారు, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలియజేశారు. మొదటి విడతలో ఇల్లు మంజూరైన వారు తక్షణమే తమ ఇండ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కటకం రవీందర్, కమ్మగోని మల్లయ్య, కుందారపు బాపు, పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కటకం నారాయణ, ఉపసర్పంచ్ ముత్యం శ్యామ్ సుందర్, కోలా నర్సయ్య, సయ్యద్ ఇక్బాల్, గుమ్మడి సతీష్, మల్యాల మహేష్ గౌడ్, కుందారపు శంకర్, కమ్మగోని రాములు, గుమ్మడి రాజు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# 28న సిఐటియు నేతృత్వంలో చలో హైదరాబాద్

### బాయికొక్క బండి..హైదరాబాదుకు రండి

### సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు రాజారెడ్డి పిలుపు



**గోదావరిఖని, జనంసాక్షి :**గోదావరిఖని ప్రాంతంలో కార్మిక సంఘాల కార్యకలాపాలు మళ్లీ ఊపందుకుంటున్నాయి. ముఖ్యంగా సిఐటియు (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఈ నెల 28న "చలో హైదరాబాద్" పేరుతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ప్రకటించారు.గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి సంస్థ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక, పరిపాలనా సమస్యలను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన సుమారు రూ.52,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ బకాయిల చెల్లింపులో ఆలస్యం జరుగుతుండటంతో సంస్థ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని పేర్కొన్నారుఅదేవిధంగా, సింగరేణి సంస్థను బలహీనపరిచే విధంగా కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సంస్థను అభివృద్ధి దిశలో నడిపించాల్సిన సమయంలో, దాన్ని దిగజార్చే విధానాలు అమలు అవుతున్నాయని విమర్శించారు. సింగరేణి ద్వారా చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు వేల కోట్ల రూపాయల వ్యయంతో పూర్తి దశకు చేరుకున్నప్పటికీ, అవి ప్రారంభానికి నోచుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు పూర్తవడానికి చాలా తక్కువ నిధులు సరిపోతాయని, కేవలం రెండు నుండి మూడు కోట్ల రూపాయలు విడుదల చేస్తే అవి ప్రజలకు ఉపయోగపడేలా ప్రారంభించవచ్చని చెప్పారు. అయితే, సింగరేణి వద్ద తగిన నిధులు లేకపోవడం వల్ల ఈ ప్రాజెక్టులు పెండింగ్‌లోనే నిలిచిపోయాయని తెలిపారు.మరోవైపు, సింగరేణి సంస్థ కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారిందని ఆయన అన్నారు. కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోవడమే కాకుండా, సంక్షేమ కార్యక్రమాలు కూడా పూర్తి కావడం లేదని ఆరోపించారు. దీనివల్ల కార్మికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ సమస్యలన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, కార్మికులు పెద్ద సంఖ్యలో "చలో హైదరాబాద్" కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని, సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించాలని సిఐటియు భావిస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిఐటియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**చిగురుమామిడి ఏప్రిల్ 23(జనంసాక్షి):**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న మహోన్నత లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని,వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను ఎక్కువ మొత్తంలో మహిళలు కేటాయిస్తుందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ తిరుపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని,రైతులు కష్టించి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు.దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని,కొనుగోలు సెంటర్లలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని వివరించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు,నీడ,తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం అతిథులను మహిళా సంఘం సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మార్క రాజ్ కుమార్ గౌడ్,ఉల్లంపల్లి సర్పంచ్ అలువాల శంకర్,ఉపసర్పంచ్ బింగి రాజేంద్రప్రసాద్,సీసీ దెంచనోజు సత్యనారాయణ,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సాంబారి బాబు, క్రాంతి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు బట్టు రమ్య,కార్యదర్శి కొండ రజిత,కోశాధికారి గుళ్ళ అనుష,వివోఏ బుర్ర ప్రేమలత,ఉషోదయ గ్రామ్యఖ్య సంఘం అధ్యక్షురాలు గుడాల రజిత,కార్యదర్శి అంతడు పుల రూప,కోశాధికారి పోతరవేని నాగమణి,వివోఏ తౌటు సుజాత,వార్డు సభ్యులు సునీల్,పైడిపల్లి సుగుణ,బుర్ర తిరుపతి,శనిగరం రాజయ్య,నాయకులు సంఘం కార్మికులు,రైతులు,మహిళా సంఘం సభ్యులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

### కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**పెద్ద కొడప్గల్ ఏప్రిల్ 23 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసిల్దార్ రాజశేఖర్, ఎస్సై అరుణ్ కుమార్, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్లు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్



**బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి ) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ మార్కెట్ కమిటీ చీల శంకర్ కోరారు. సాలూర మండలం హున్స గ్రామంలో గురువారం టీజీ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సంగం ఇన్చార్జి చైర్మన్ అరుణ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం కోట్లాది రూపాయలతో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రైతు భరోసా, రైతు బీమా పథకాలను అందించడంతో పాటు ధాన్యం మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర అందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా పండించిన ధాన్యంకు బోనస్ సైతం అందించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని ఆయన స్పష్ట చేశారు. ఈ మేరకు రైతులు పంటకు గిట్టుబాటు ధరను పొందేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్న పంటను తరలించాలని బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో హున్స సర్పంచ్ మర్కల్ శివకుమార్, కొప్పర్తి క్యాంపు సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మేదరిమెట్ల సతీష్, ఖాజాపూర్ సర్పంచ్ చింతం నాగయ్య, మందర్న సర్పంచ్ రావుబా గంగాధర్, మాజీ సర్పంచ్ మందర్న రవి, నాయకులు ఇల్తేపు శంకర్, మురిగే శంకర్, వినోద్ బాబా, అశోక్ గౌడ్, బసవంతరావు, చిద్రపు అశోక్, సొక్కం రవి, సహకార సంఘం కార్యదర్శి హన్మంత్ రావు, ఏఈఓ సంధ్య, సిబ్బంది నరేందర్, సందీప్, రైతులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ శంఖుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన

### జిల్లా ఎస్పీ మహేష్ బి గితే



**రుద్రంగి ఏప్రిల్ 23 (జనం సాక్షి)**రుద్రంగి మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి నేడు (శుక్రవారం) శంఖుస్థాపన చేయనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ గురువారం పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ చేతులమీదుగా ఈ శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ శ్రీనివాసులు, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ రమేష్, ఎస్సై లు మోతీరాం, రమేష్, యాదగిరి,పోలీస్ హౌసింగ్ బోర్డు ఏఈ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేసిన సర్పంచ్ పోతావేణి నారాయణ గౌడ్



**మల్లాపూర్ ఏప్రిల్ 23(జనం సాక్షి)**సాతరంజిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో సర్పంచ్ పోతవేణి నారాయణ గౌడ్ విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మన పాఠశాలలో అన్ని విధాలుగా సదుపాయాలు ఉన్నాయని అనుభవం కలిగిన ఉపాధ్యాయ బృందం ఉంది తప్పకుండా విద్యార్థులు మన ప్రభుత్వ పాఠశాలలోనే చదివే విధంగా కృషి చేయాలని,ఏ విధమైన సమస్యలున్నా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.అలాగే మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున బయటకు వెళ్ళవద్దని, ఈత కోసం బావులు, చెరువుల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను సర్పంచ్ చేతుల మీద పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ హరి పాఠశాలలో నీటి సమస్య ఉన్నందున వాటికి కావలసిన సదుపాయాలు చేయాలని సర్పంచికి సమస్య తెలపగా వెంటనే స్పందించి బోరు బావిని వేయిస్తానని వాటర్ ట్యాంక్ పై స్లాబ్ చేస్తానని హెచ్ఎంకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షులు బొడ్డు రాజేష్, పాఠశాలప్రధానోపాధ్యాయులు యన్.శ్రీహరి, అంబాటి భువనేశ్వర్,ఉపాధ్యాయులు శేషగిరి, శ్రీను,చంద్రప్రకాష్,ఖాజా,గీత విద్యార్థుల పేరెంట్స్ రాకేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రంను ప్రారంభించిన రూరల్ ఎస్ఐ




**బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి ) :** సాలూరు మండలం జాడి జమాల్పూర్ గ్రామంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్నందున గ్రామస్తులకు అసౌకర్యంగా ఉన్నందున కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. చలి వేంద్రం నిర్వహణకు నీరు ఉచితంగా అందించడానికి బాలవికాస కమిటీ ముందుకొచ్చినందుకు కమిటీ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా గ్రామ కార్యదర్శి వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ చంద్రకళ, బిపిఎం సుజాత, గ్రామ పెద్దలు మల్లవంపు సుందర రాజు, కే బాలరాజు, బీ ఆరోగ్య రాజు, బలరాం, భాస్కర్, శివకుమార్, నర్సింలు, వార్డు మెంబర్లు షేక్ మజర్, పులి ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇల్లు లేని నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నరసింగరావు

**మల్లాపూర్, ఏప్రిల్ 23( జనం సాక్షి)**మల్లాపూర్ మండలం లో కొత్త దామరాజ్ పల్లి గ్రామం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు లను కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడ నరసింహారావు నూతన నిర్మించిన 16 ఇంద్రమ్మ ఇండ్లు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జువ్వాడి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంపేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సహాయం అందిస్తుందని, ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ తప్పకుండా ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తామని అన్నారు, కొత్తదామజ్ పల్లి సర్పంచ్ ఎగరపు లింబాద్రి తనయుని పెళ్లి పత్రిక ఇచ్చి వివాహానికి సర్పంచ్ లింబాద్రి ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బద్దం నరసారెడ్డి మండల అధ్యక్షులు పూండ్ర శ్రీనివాసరెడ్డి గారు సర్పంచ్ లింబాద్రి కిరణ్ ఏఎంసీ చైర్మన్ పుష్పలత మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయిలో నారాయణ విద్యార్థుల ప్రభంజనం




**గోదావరిఖని, జనంసాక్షి:**స్థానిక నారాయణ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన 3వ సీనాప్స్ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో గోదావరిఖని నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు.ఈ పోటీలలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు4వ తరగతి ( ఐ ఎస్ ఈ ఓ విభాగం)?ఎస్. శ్రీ వైష్ణవి ఆల్ ఇండియా 1వ ర్యాంక్ సాధించి సంచలనం సృష్టించింది.?బి. శ్రీహన్ ఆల్ ఇండియా 4వ ర్యాంక్ సాధించారు.?డి. ఆయాన్ కిషన్ ఆల్ ఇండియా 5వ ర్యాంక్ కైవసం చేసుకున్నారు.?7వ తరగతి ( ఆర్ ఓ ఎం విభాగం) ?సాహిష్ణవ్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 7వ ర్యాంక్ సాధించారు.జాతీయ స్థాయి విజేతలకు నిర్వాహకులు బంగారు పతకాలు , ల్యాప్‌టాప్‌లు ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ?ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల కఠోర శ్రమ, క్రమశిక్షణతో పాటు ఉపాధ్యాయులు అందించిన నాణ్యమైన శిక్షణే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు ఇంతటి ఘనత సాధించడం గర్వకారణంగా ఉందని, రాబోయే రోజుల్లో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జీఎం గోపాల్ రెడ్డి తో పాటుగా డీజీఎం వెంకటరమణారెడ్డి, కరీంనగర్ జోన్ ఏజీఎం చైతన్య రావు, ఆర్ ఐ సత్యం రావు, గోదావరిఖని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ ఏ. రజిని, అకాడమిక్ డీన్ గర్రెపల్లి ఆంజనేయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతుల లబ్ధికే కొనుగోలు కేంద్రాలు.. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**గన్నేరువరం, ఏప్రిల్ 23 (జనంసాక్షి):** రైతులకు ప్రయోజనం చేకూర్చడమే కొనుగోలు కేంద్రాల ప్రధానోద్దేశమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం గన్నేరువరం మండలం గుండ్లపల్లి, గుండ్లపల్లి ఎక్స్ రోడ్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నెలకొల్పిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్, హాకా, మెప్మాల ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వరి, మొక్కజొన్నలు,పొద్దుతిరుగుడు గింజలను ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, ప్రైవేటు వ్యాపారులు, దళారులకు అమ్మి మోసపోవద్దని ఆయన రైతులను కోరారు. గతంలో కన్నా ఇప్పుడు ప్రభుత్వం మద్దతు ధరను పెంచినందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చి మద్దతు ధర పొందాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో గుండ్లపల్లి సర్పంచ్ కాల్వ పద్మ-కొమురయ్య, గుండ్లపల్లి క్రాస్ రోడ్ సర్పంచ్ చింతల ఉమారాణి-అనిల్ కుమార్, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, జిల్లా సహకార కేంద్రబ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, డీఆర్డీవో శ్రీధర్,డీఎస్వో నర్సింహారావు, డీఎం రజనీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఐకేపీ డీపీఎం ప్రవీణ్ కుమార్, వేణు, ఉప సర్పంచులు వి.లక్ష్మారెడ్డి, వి.సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డు సునిల్, జె.మల్లేశం తదితరులు పాల్గొన్నారు గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే హాజరుగన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామంలో పార్టీ సీనియర్ కార్యకర్త బొల్లి శంకరయ్య దంపతులు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోగా, గురువారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హౌస్ ఏఈ మహేందర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ సురేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అలువాల కోటి తదితరులు పాల్గొన్నారు.

# తెర్లుమద్ది గ్రామంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం సర్పంచ్ బైతి దుర్గవ్వ

**ముస్తాబాద్ ఏప్రిల్ 23( జనం సాక్షి)**ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలోని విశ్వ బ్రాహ్మణ వార్డులో చాలా కాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యకు చివరికి శాశ్వత పరిష్కారం లభించింది. కొత్తగా ఎన్నికైన సర్పంచ్ మరియు పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన తరువాత కాలనీ వాసులు తమ సమస్యను వారి దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై తక్షణమే స్పందించిన సర్పంచ్ పాలకవర్గం సభ్యులు పరస్పరం చర్చించి, దాదాపు 150 మీటర్ల మేర ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. ఈ చర్యతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ పాలకవర్గాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైతి దుర్గమ్మ, ఉప సర్పంచ్ మామిండ్ల కానుకవ్వ, కార్యదర్శి సౌజన్యతో పాటు వార్డ్ సభ్యులు బద్ధ రాములు, కొమ్మెట రాజు, అంతడుపుల దేవయ్య, కొమ్మెట రాజలింగం, కొండం విష్ణు, గోక దివ్య-స్వామి పాల్గొన్నారు.గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యను వేగంగా పరిష్కరించడం ద్వారా స్థానిక పాలకవర్గం ప్రజల విశ్వాసాన్ని పొందిందని గ్రామస్తులు పేర్కొన్నారు.



## యదేచ్ఛగా అక్రమ ఇంటి నిర్మాణం

### పిప్రి గ్రామ కార్యదర్శికి పట్టని పట్టింపు

**ఆర్మూర్,ఏప్రిల్ 23 (జనంసాక్షి):** సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి సవాలక్ష ప్రశ్నలు వేసే అధికారులు,ప్రభుత్వ భూమిని ఆక్రమించి అనుమతి లేకుండా అక్రమ నిర్మాణం చేపడు తున్న గ్రామపంచాయతీ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామంలో ఫతేపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి పెద్ద ఇంటి నిర్మాణం జరిగింది. సుమారు 20 నుండి 30 ఫీట్ల వరకు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దర్జాగా భవన నిర్మాణదారుడు నిర్మాణం చేపట్టాడు. అక్రమ నిర్మాణ భవనానికి ఎలాంటి అనుమతులు లేకపోవడం, ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం జరిగింది..తెలంగాణ ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికీ అలాంటి నిబంధనలేవి పిప్రి పంచాయతీ కార్యదర్శి వద్ద పనిచేయడం లేదు.మండల స్థాయి,జిల్లా ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణం పై విచారణ జరిపి సంబంధిత పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# సన్న వడ్లకు బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే



రైతుల మక్కలు అధికంగా పండించారని మక్కలు కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసేందుకు వీలులేదని త్వరలోనే స్థలం చూసి కొనుగోలు కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేస్తామని అన్నారు.రైతులు ఎవరు అధైర్య పడవద్దని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉందని రైతులెవరు నష్టపోవద్దని సంకల్పంతో కొనుగోలు చేపడుతోందని, సుల్తానాబాద్ మండలంలోని 16 కోట్ల పై చీలుకు బోనస్ రైతులకు వచ్చిందని తెలిపారు. గత వర్షాకాలంలో 8 కోట్ల 71 లక్షలు వచ్చాయని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నారని అన్నారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కటింగ్ పేరుతో నిలువు దోపిడి చేశారని 15 కిలోల నుండి 20 కిలోల వరకు కట్ చేసిన సందర్భాలు ఉన్నాయాలని ధ్వజమెత్తారు. అలాంటివి ఏవి లేకుండా నేడు ఐదు పసళ్ళ గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేశామని తెలిపారు. రైతులు ప్రభుత్వం సూచించిన విధంగా వరి ధాన్యానికి 15% మ్యాచర్ వచ్చేలా చూడాలని కోరారు.సంబంధిత జిల్లా కలెక్టర్ వ్యవసాయ సింగల్ విండో తదితర అధికారులు అందుబాటులో ఉన్నారని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని, రైతులకు వడగళ్ల వానలు వచ్చిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని సంచులు కవర్లు అం దు బా టు లో ఉండేలా చూడాలని సూచించారు. రే కాకుండా, రైతుల వివిధ రకాల ధాన్యానికి సంబంధిత రేట్లను సూచించే పట్టికలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి దాన్యపు గింజ కొనుగోలు చేస్తామని ఆ బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరి దాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, సాయిరి మహేందర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రామన్న, చిలుక సతీష్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు,వేగోళం అబ్బయ్య గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత దుగ్యాల సంతోష్ రావు, మండల వ్యవసాయ అధికారిణి పైడితల్లి, సుల్తానాబాద్,సహకార సంఘ పర్సన్ ఇన్చార్జి ఎన్ వెంకటేశ్వర్లు, సంఘ సీఈవోలు బూరుగు సంతోష్, సుద్దాల సీఈవోసతీష్, మున్సిపల్ కౌన్సిలర్లు ఈర్ల స్వరూప శేఖర్,గాజుల రాజమల్లు, చింతల రాజు,ఉట్ల వరప్రదీప్,తొర్రికొండ ప్రభాకర్,గరిగే శోభారాణి శ్రీనివాస్,కల్వల శంకరమ్మ ఓదెలు,వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్,గాదాసు మంజుల రవీందర్,కందునూరి సమతా కుమార్,సిద్ధ తిరుపతి,అమ్మిరి శెట్టి తిరుపతి, అమిరిశెట్టి రాజలింగం, రేగడి మద్దికుంట సర్పంచ్ బోయిని లావణ్య శ్రీనివాస్, సుద్దాల సర్పంచ్, ఓజ్జ సంపత్ యాదవ్, మినుపాల డి ల్లేశ్వరరావు,కాసర్ల అనంతరెడ్డి,మాజీ ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## చల్మెడ పుట్టినరోజున ఆర్థిక సాయం అందించిన మంచే రాజేశం

### మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎంపీటీసీ లావణ్య రాజేశం

**రుద్రంగి ఏప్రిల్ 23 (జనం సాక్షి)**

రుద్రంగి మండల కేంద్రంలో గురువారం వేములవాడ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చలిమెడ లక్ష్మీనరసింహారావు జన్మదినం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన బోయిని రాములు,మరి పెల్లి సతీష్ లు ఇటీవల అకాల మృతి చెందగా వారి కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. చల్మెడ లక్ష్మీనరసింహారావు పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ వంతు సహాయంగా రుద్రంగి మాజీ ఎంపిటిసి సభ్యులు మంచే రాజేశం బోయిని రాములు కుటుంబానికి 5వేలు,మరిపెల్లి సతీష్ కుటుంబానికి 5వేల ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కంటే రెడ్డి, తోపాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్

**ముత్తారం(జనంసాక్షి )**

ముత్తారం మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా శ్రీధర్ గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు.ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంజీవయ్యవిధులు నిర్వహించి బదిలీ అవడంతో అతని స్థానంలో బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయనకు అధ్యాపకులు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ? విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ఉన్నత ఫలితాల సాధన లక్ష్యంగా అధ్యాపాకులతో కలిసి పని చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఐఈఓ కల్పన, జంగపెల్లి రాజేశం తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్ల పంపిణి..

**ముత్తారం ఏప్రిల్ 23(జనంసాక్షి)**

ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ అంజయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందగా అతని జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు విద్యార్థులకు ప్లేట్లు గురువారం ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొప్పరి సంపత్, ప్రధానోపాధ్యాయుడు సదానందం తోపాటు ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






## ఖరీదైన వస్తువులకు బాధ్యులు ఎవరు పట్టించుకోండి సార్

### వాస్తవానికి ఒక నైట్ వాచ్మెన్ ఉండాలి కానీ సర్కులర్ రాలేదు : ఎంఈఓశ్రీహరి

**గాంధారి ఏప్రిల్ 23జనంసాక్షి:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాణ్యమైన విద్యను అందించాలని అటు కంప్యూటర్ విద్యతో పాటు నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం తో విద్యా ప్రమాణాలు సిబిఎస్ సిలబస్ తో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తుంది. అంతేకాకుండా విద్యార్థులు మధ్యాహ్నం పూట కూడా ఇంటికి వెళ్లకుండా మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు చేసి విద్యార్థుల ఆకలిని కూడా తీర్చి ప్రొద్దున వెళ్లిన విద్యార్థులు మధ్యాహ్నం అక్కడే భోంచేసి తిరిగి సాయంత్రం వస్తున్నారు అయితే పిల్లల పట్ల విద్య పట్ల ప్రభుత్వానికి అంత ప్రేమ ఉంది కానీ విద్యార్థులు చదివే ప్రభుత్వ విద్యాలయాల పట్ల వేసవి సెలవు దినాల్లో లక్షల రూపాయలు వెచ్చించి తీసుకువచ్చిన ఐఎఫ్టిలకు కంప్యూటర్లకు మిగతా సామాగ్రికి రాత్రి కాపలా ఉండేది ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది.

**లక్షల విలువైన వస్తువులను సెలవు దినాల్లో కాపాడేది ఎవరు**

ప్రతి మండలంలో రెండు లేక మూడు జిల్లా పరిషత్ ఉన్నత స్థాయి పాఠశాలలు ఉంటాయి అంటే కామారెడ్డి జిల్లా కేంద్రంలో 25 మండల కేంద్రాలు ఉండగా అందులో 184 జిల్లా పరిషత్ ఉన్నత స్థాయి పాఠశాలలు ఉన్నాయి. అయితే ప్రతి ఒక్క మండల కేంద్రంలోని ఒక్కో స్కూల్ నందు ఒక్కొక్క ఐ ఎఫ్ టి ఖరీదు దాదాపు 3 లక్షల పై మాటే అంటే ఒక్కో స్కూల్లో రెండు నుంచి మూడు ఐ ఎఫ్ టి లు ఉంటాయి వీటి విలువే దాదాపు 10 లక్షల వరకు ఉంటుంది మిగతా సామాగ్రి వేరు మరియు కంప్యూటర్ సామాగ్రి అదనంగా ఉంటే దాదాపు 15 లక్షల రూపాయల వరకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సామాగ్రి అంచనా విలువ. వేసవి కాలంలో సెలవు దినాలుగా జూన్ 12 వరకు సెలవులను ప్రకటించిన ప్రభుత్వం ఈ సెలవు దినాల్లో వాటికి బాధ్యులుగా ఎవరిని నియమిస్తారు వాటిని బాగోగులు రాత్రిపూట కాపలాదారులు ఎవరుంటారు అనేది ప్రశ్నార్థకంగా ఉంటే... లక్షల రూపాయల వాటికి కనీసం రెండు నెలల పాటు ఒక వాచ్మెన్ ఉంచిన బాగుండు అని ప్రజల అభిప్రాయం.

**వాస్తవానికి ఒక నైట్ వాచ్మెన్ ఉండాలి కానీ సర్కులర్ రాలేదు..ఎంఈఓశ్రీహరి..**

వాస్తవానికి ప్రభుత్వం వెచ్చించి విద్యార్థుల కోసం నాణ్యమైన విద్యను అందించడానికి ఐ ఎఫ్ టి లను కంప్యూటర్ ల్యాబ్ లను ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటివరకైతే ప్రభుత్వం నుండి ఎలాంటి సర్క్యులర్ రాలేదని వస్తే తప్పనిసరిగా నైట్ వాచ్మెన్ ను నియమిస్తామని ఎంఈఓ శ్రీహరి అన్నారు. అంతేకాకుండా విలువైన సామాగ్రి పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా నైట్ వాచ్మెన్లను నియమిస్తే చాలా బాగుంటుందని అప్పటివరకు ఆయా గ్రామస్తుల వారికి స్కూలు గురించి చూసుకోవాలని విజ్ఞప్తి చేస్తామని అంతేకాకుండా రెండు మూడు రోజులకు ఆయా ప్రాంతాలవారీగా ఉపాధ్యాయులు తరచివస్తు చూస్తూ ఉండాలని ఆయా ఉపాధ్యాయులకు ఆదేశించామని ఎంఈఓ తెలిపారు.

# ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు సహించబోం

**నరేంద్ర మోదీ పై మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం**

**మల్లికార్జున కార్గే ఫ్లెక్సీ చిత్రపటం దగ్ధానికి ప్రయత్నం,అడ్డుకున్న పోలీసులు**

**సుల్తానాబాద్,ఏప్రిల్ 23(జనంసాక్షి) :**
మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మల్లికార్జున ఖర్గే దిష్టి బొమ్మ దహనానికి యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు.ప్రధానిని 'టెర్రరిస్ట్' అనడం కాంగ్రెస్ దివాళాకోరుతనానికి నిదర్శనమని,ప్రజాస్వామ్యాన్ని కాలితో తన్నిన కాంగ్రెస్,కాంగ్రెస్ ,డి.ఎన్.ఏ. లోనే వ్యక్తులను అవమానించే సంస్కృతికి నిరసనగా,సుల్తానాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జి లతో నిరసన తెలిపి దిష్టి బొమ్మ దహన చేసేందుకు యత్నించిగా, పోలీసులు అడ్డుకొని వారించారు.బిజెపి ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన 'టెర్రరిస్ట్' అనే వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని, ఇవి ఆయన అజ్ఞానానికి, దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, కోశాధికారి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. ఇట్టి వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వయసు పెరిగే కొద్దీ విజ్ఞత పెరగాలి ,కానీ ఖర్గే మాటల్లో వివేకం లోపించిందని, 140 కోట్ల మంది ప్రజల ఆశీర్వాదంతో వరుసగా మూడోసారి పీఠాన్ని అధిరోహించిన ప్రధానిని అవమానించడం అంటే ప్రజా తీర్పును కాలితో తన్నడమేనని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.అభివృద్ధి అజెండాపై పోటీ పడలేక, ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, జీ20 సదస్సు, చంద్రయాన్ వంటి చారిత్రక ఘనతలను జీర్ణించు కోలేని కాంగ్రెస్, నిరాశా నిస్పృహలతో ఇలాంటి వ్యక్తిగత దూషణలకు ది గ జా రి ం ద ని విమర్శించారు. గతంలో



చాయ్‌వాలా అని, నీచ్ అని, మౌత్ కే సౌదాగర్ అని ప్రధానిని అవమానించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు 'టెర్రరిస్ట్' అనడం వారి సంస్కృతిని ప్రతిబింబిస్తోందని, దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని,దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే నాయకుడిపై బురద చల్లడం అంటే భరతమాతను అవమానించడమేనని, స్పష్టం చేశారు. ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పార్టీకి ఇతరుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. ప్రధాని మోదీ కేవలం వ్యక్తి కాదు, కోట్లాది మంది భారతీయుల ఆశల ప్రతిరూపమని, సర్జికల్ స్ట్రైక్స్ నుండి మొదలుకొని పేదవాడి కళ్లలో ఆనందం చూసే ప్రతి పథకం మోదీ నాయకత్వంలోని గొప్పతనానికి నిదర్శనమని చెప్పారు.తన వ్యాఖ్యలకు మల్లికార్జున ఖర్గే బేషరతుగా దేశ ప్రజలకు, భరతమాతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ప్రజా క్షేత్రంలో వారు మరింత దిగజారిపోతారని, 2029 ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని తీవ్రంగా హెచ్చరించారు. రాజకీయాల్లో విమర్శలు ఉండవచ్చు కానీ బరితెగింపు, నీచమైన పదజాలం సరికాదని, ప్రతిపక్షాలకు ఉండాల్సిన బాధ్యతను కాంగ్రెస్ విస్మరించిందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర ప్రాంతంలో మల్లికార్జున ఖర్గే, దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డగించారన్నారు. అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు వేల్పుల రాజన్న పటేల్, కొమ్ము తిరుపతి యాదవ్,బీజేపీ నాయకులు కందునూరి కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్,ఉపాధ్యక్షులు దొంగల శ్రీనివాస్ రెడ్డి,దాసరి వెంకటేష్, ఎర్రం సంతోష్ రెడ్డి,యువ మోర్చా నాయకులు కొమ్మిడి రాజేందర్ రెడ్డి, ఉషణ అన్వేష్, వడ్లకొండ శశి వర్ధన్, సీనియర్ నాయకులు నాగుల్లమల్యాల తిరుపతి,మెండే శంకరయ్య,మల్కా భాగ్యలక్ష్మి, బండారి లత,చిట్టవేణి సదయ్య, వీరగోని కిరణ్ గౌడ్,ఎనగందుల ఎల్లయ్య,కలవాల శ్రీనివాస్ రెడ్డి,వలస సాయి కిరణ్,సుబ్బని సురేష్,తదితరులు పాల్గొన్నారు.



## శాంతినగర్ లో పోషణ పక్వాడ అవగాహన

**బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి ) :**
జిల్లా మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శాంతినగర్ వార్డ్ నెంబర్ 11 లో పోషణ పక్వాడ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధిక మాట్లాడుతూ, ప్రతి ఒక్క గర్భవతి బాలింత ఆయురారోగ్యంగా ఉండాలని తగు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లలు ఎండలో వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లలిత, శేషమ్మ శాంతి నగర్ తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## చెరువులో పడి వృద్ధురాలు మృతి

**బోయినపల్లి, ఏప్రిల్ 23 (జనం సాక్షి)**
మానసిక స్థితి సరిగా లేక ఓ వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందిన ఘటన బోయినపల్లి మండలంలోని కొరెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రొమాల మల్లవ్వ (70) కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఈనెల 20న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో స్థానిక కొరెం చెరువులో మృతదేహం తేలియాడటాన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మల్లవ్వగా గుర్తించారు. మానసిక స్థితి సరిగా లేక ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించి ఉండవచ్చని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోలులో గింజ కటింగు ఉండదు



- కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు
- సిబిఐ విచారణకు బిజెపి ప్రభుత్వం కాలయాపన
- హరీష్ రావు, కేటీఆర్ బహిరంగ చర్చకు సిద్ధమా?
- పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- రైతులకు అండగా ప్రజాప్రభుత్వం
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

**సుల్తానాబాద్,ఏప్రిల్ 23(జనంసాక్షి) :**
కాళేశ్వరం అవినీతిపై,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, కేటీఆర్,బహిరంగ చర్చకు రావాలని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సవాలు విసిరారు.గురువారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మడిపల్లికాలనీ, పెగడపల్లి, గంగారం,పందిళ్ళ, లక్ష్మీపురం, ఇప్పలపల్లి,అరేపల్లి,తారుపల్లి, మిర్జంపేట కాల్వ శ్రీరాంపూర్ గ్రామాల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో, కలిసి ప్రభుత్వ విప్ పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం జరిగిన పలు సమావేశాలలో,ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ విచారణకు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీర్మానం చేస్తే, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకులను కాపాడేందుకు ఈ విచారణను కాలయాపన చేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణరావు ధ్వజమెత్తారు.కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కోర్టు ఇచ్చిన తీర్పుతో బిఆర్ఎస్ నాయకులు జబ్బలు చరుచుకుంటున్నారని, కోర్టు తీర్పులో కమిటీ వేయడంలో ప్రభుత్వం తప్పు లేదని, కమిటీ రిపోర్ట్ వాస్తవాలు, అవాస్తవాలు గ్రహించామని కెసిఆర్, హరీష్ రావులను ఇప్పుడే అరెస్టు చేయకండి అని తీర్పు ఇచ్చిందని, ప్రభుత్వమును కోర్టు ఎక్కడ తప్పు పట్టలేదన్నారు. మళ్లీ దానిమీద క్షుణ్ణంగా ఆలోచించండని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, కడితే అందులో బుంగలు పడ్డది నిజము కాదా! అని ఎమ్మెల్యే విజయరమణ రావు ప్రశ్నించారు.ఎమ్మెల్యే ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టు కృంగిన విషయంపై అక్కడికి ఎవరు పోకుండా వారి తప్పులు కప్పిపుచ్చుకోవడానికి బి ఆర్ ఎస్ పారా మిలటరీ దళాలను పెట్టింది కూడా నిజము కాదా అని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఉమ్మడి జిల్లాల్లో కనీసం 1000 ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదన్నారు. మెదక్ జిల్లా కోసం మల్లన్న సాగర్, కొండ పోచమ్మ రిజర్వాయర్ కట్టుకొని ఇక్కడ నీళ్లను తీసుకపోవడానికి ప్రయత్నం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక కాళేశ్వరం నుంచి చుక్క నీరు కూడా రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచే సాగునీరు అందుతుందన్నారు. ఎస్సారెస్పీ షెటర్లు పోతే గత ప్రభుత్వం ఎక్కడ కూడా ఒక్క షెటర్ కూడా నిర్మాణం చేయలేదన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ జవహర్ లాల్ నెహ్రూ శంకుస్థాపన చేస్తే ఇందిరాగాంధీ ప్రాజెక్టు ప్రారంభించి కాల్వలను తవ్వించడం జరిగిందని అదే కాలువలకు టిడిపి ప్రభుత్వం లైనింగ్ వేసిందన్నారు. మీరు ఏమి చేశారన్నది హరీష్ రావు, కేసీఆర్, కేటీఆర్ బహిరంగ చర్చకు రమ్మని అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు,సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శ్రీపాద ఎల్లంపల్లి, మీడ్ మానేరు, కడెం, ఎస్సారెస్పీ, ప్రాజెక్టులు కట్టడంతో పాటు వరద కాలువలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే తవ్వించిందన్నారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రులు కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ చేయించండని డిమాండ్ చేశారని, అన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఈ రెండు పార్టీలు ఒకటేనని పేర్కొన్నారు.నేషనల్ డ్యాం అథారిటీ అధికారి కాళేశ్వరం సందర్శిస్తే కేంద్ర మంత్రి బండి సంజయ్ నువ్వెందుకు పోయినవు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చిత్తశుద్ధి లేని మీ మాటలు, వింటుంటే బిఆర్ఎస్, బిజెపి కలిసి పోవాలని ఉన్నట్టుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలింది నిజము కాదా దీనికి కిషన్ రెడ్డి ,బండి సంజయ్ సమాధానం చెప్పాలి డిమాండ్ చేశారు.ఈ రాష్ట్రంలో 70 శాతం రైతులు వరి పండిస్తే ఈ వేసంగి లో ఆ వరి



బాయిల్డ్ రైస్ తప్ప రా రైస్ కాదని , కానీ కేంద్రం రా రైస్ కొంటాం అంటుందని, ఏ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు ఆరుగురు బిజెపి ఎంపీలు ఉన్న రైతుల పట్ల మీకు ఎలాంటి చిత్త శుద్ధి లేదన్నారు. సెంటిమెంట్ రగిలిస్తూ బిజెపి కేంద్రంలో అధికారం చేపడుతుందని రాష్ట్రంలో కేసీఆర్ కూడా సెంటిమెంటుతో 10 సంవత్సరాలు పరిపాలన చేశాడని, ఈ సెంటిమెంట్ ఎన్ని రోజులు ఉండదని రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది జయ రమణారావు తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ అవినీతి జరిగిందని సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి నివేదిక ఇచ్చారని ,ఈ నివేదికపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి మండలి తో కూర్చొని మాట్లాడడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, ప్యాక్స్ స్పెషల్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి, మానిటరింగ్ అధికారి ఇమ్రాన్ మహమ్మద్, సీఈవో కోలేటి శ్రీనివాస్, ఏ పీఎం లవ కుమార్, మార్కెట్ సెక్రటరీ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజన వేన సదయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఐకెపి సీసీలు,పలు గ్రామాల ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో రానున్నది బహుజన రాజ్యమే

## ఏఐఎఫ్ బీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్

**పెద్దపల్లి,ఏప్రిల్ 23(జనంసాక్షి) :** పెద్దపల్లిలో రానున్నది బహుజన రాజ్యమేనని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ మెహరాజ్ కు పార్టీ కండువా కప్పి ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో పెద్దపెల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఏకమై బహుజన రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బహుజనులందరిని ఏకం చేసి, వారి ఆశీర్వాదంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని తెలిపారు. బహుజన బిడ్డనైనా నన్ను దీవించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మహమ్మద్ మెహరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, అందుకే భోజనం రాజ్యం కోసం ఫార్వర్డ్ పార్టీలో చేరానన్నారు. కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుజనలంతా ఏకం చేసి ఒక బీసీ బిడ్డ ఎమ్మెల్యేగా చేసే వరకు తన పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, గులాం ఖాజా పాషా, కుక్క కనకరాజు బొంకూరి నరేందర్, కుక్క అశోక్, ఇరుగురాల రాజు, కుక్క శ్రీనాథ్, వడ్డేపల్లి తిరుమల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్

**సుల్తానాబాద్,ఏప్రిల్ 23(జనంసాక్షి) :** పట్టణంలోని, చిలగాని విశ్వనాదం తల్లి చిలగాని వరలక్ష్మి, గత కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. గురువారం మృతురాలు చిలగాని వరలక్ష్మి ఇంటికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర నాయకులు ఏగోలపు సదయ్య గౌడ్ పరమార్శించారు.కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పండితులుశ్రవణ్,చిలగాని శివ,ప్రవీణ్ కుమార్,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఐత్రాజుపల్లి యువకుల చేయూత

- భోజన ఖర్చులకై 5,000/- ఆర్థిక సహాయం అందించిన ఐతరాజుపల్లి యువనాయకులు వై కే ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడ్డి సాయికిషోర్ గౌడ్
- 25 కేజీల బియ్యం అందించిన ఐతరాజుపల్లి బీజేపీ సీనియర్ నాయకులు ఎర్రం సంతోష్ రెడ్డి

**సుల్తానాబాద్,ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** మండలంలోని ఐత్రాజుపల్లి గ్రామానికి చెందిన పేదింటి ఆడబిడ్డ కొత్తూరి మానస వివాహం సందర్భంగా గురువారం, వరపూజ కార్యక్రమం లో భాగంగా వారి ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని జరిగే వరపూజ కార్యక్రామానికి భోజన ఖర్చులకై 5,000/- ఆర్థిక సహాయం ఐతరాజుపల్లి యువనాయకులు మడ్డి సాయికిషోర్ గౌడ్ ,25 కేజీల బియ్యం ఎర్రం సంతోష్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా కొత్తూరి మనోజ్ కుటుంబసభ్యులు మడ్డి సాయికిషోర్ గౌడ్ ఎర్రం సంతోష్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో కొత్తూరి సత్యనారాయణ, మీయపురం రాంమోహన్,ఈర్ల అమరేందర్, పిట్టల శ్రీకాంత్,చిన్న,తదితరులు పాల్గొన్నారు.





# సిరికొండ మండలంలో ఎలుగుబంటి దాడి

**సిరికొండ ఏప్రిల్ 23 (జనంసాక్షి)**

సిరికొండ మండలం లోంకా తాండ గ్రామానికి చెందిన బాణావత్ అరవింద్ (18) పొలం పనుల నిమిత్తం లోంకా అటవీ సమీపం లో పొలానికి వెళ్లి తిరిగి వస్తున్నా సమయంలో ముక్క మైసమ్మ వద్ద ఎలుగు బంటి దాడి చేసిందని బాధితుడు తెలిపాడు. ఈ ఘటన లో అతని ఎడమ భుజానికి గాయాలు అయ్యాయి. వెంటనే బాధితుడుని స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.



# మేదోశక్తితో విద్యను నేర్చుకోవాలి

## ఇంచార్జ్ జోనల్ అధికారి గిరిజ

**సుల్తానాబాద్,ఏప్రిల్ 23(జనంసాక్షి) :** ప్రతి విద్యార్థి మేదో శక్తితో విద్యను నేర్చుకోవాలని, కాలేశ్వరం జోనల్ వన్ ఇన్చార్జి అధికారి చెంచు గిరిజ అన్నారు.గురువారం జిల్లాలోని గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలను సందర్శించి సెలవు పై వెళుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సెలవు పై వెళ్తున్న విద్యార్థులు నిత్యం సెల్ ఫోన్ లు, టీవీలు చూసి సమయం వృధా చేసుకోకుండా ప్రతిరోజు ఒక గంట సమయం కేటాయించి మైండ్ స్పోర్ట్స్ విద్యను అభ్యాసించాలని, కోరారు. సెలవులు ముగిసిన అనంతరం విద్యార్థులు సమయానికి అనుకూలంగా పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల మార్కుల జాబితాను చూసి వారిని అభినందించారు.ప్రిన్సిపల్ ఎం మంజులమాట్లాడుతూ విద్యార్థుల కదలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజు ఎండలో తిరగకుండా అత్యవసర సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే తలపై గుడ్డ వేసుకుని వెంట నిమ్మరసం నీటిని తీసుకొని జాగ్రత్తలు పడాలని టీజీపీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక దాసరి భాస్కర్ కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపల్ డి ధనలక్ష్మి,జెవిపి సృజన,ఉపాధ్యాయులు పద్మజ,పిఈటి అంజలి,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ విజయ రమణారావు

**సుల్తానాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** మండలంలోని,చిన్న బొంకుర్ గ్రామంలోకూన రాజు శారద నిర్మాణం చేసుకున్న, ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా, సర్పంచ్ అబ్బోజు కవిత బ్రహ్మాచారి ఉపసర్పంచ్.వార్డ్ మెంబర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావుకు కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు.



# ఘోష్ కమిషన్‌పై హైకోర్టు తీర్పు

- ప్రభుత్వానికి చెంపపెట్టు -కాళేశ్వరం పై తప్పుడు ప్రచారం బహిర్గతం"
- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి,ఏప్రిల్ 23(జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి లిదాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు తీర్పు... ప్రభుత్వానికి చెంపపెట్టు అని, పై తీర్పు ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం బహిర్గతం అయిందన్నారు.గౌరవ హైకోర్టు కమిషన్ నివేదిక సహజ న్యాయ సూత్రాలు, ప్రాథమిక హక్కులు మరియు ఎంక్వైరీ యాక్ట్-1952కు విరుద్ధంగా ఉందని స్పష్టంగా పేర్కొనడం ద్వారా కమిషన్ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు బయటపడ్డాయని ఆయన అన్నారు.ఈ తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్ష సాధింపుతోనే తప్పుడు ఆరోపణలు చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని అపకీర్తి పరచాలనే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. కోర్టు తీర్పుతో ఈ ఆరోపణలు అసత్యమని తేటతెల్లమైందని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచిందని, మూడు బ్యారేజీలు, అనేక రిజర్వాయర్లు, లిఫ్ట్ వ్యవస్థలతో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు త్రాగునీరు, పరిశ్రమలకు నీటి సరఫరాలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.కేవలం మేడిగడ్డ బాలాజీ ల రెండు పిల్లర్ల లోని కొన్ని సాంకేతిక లోపాలను చూపిస్తూ మొత్తం ప్రాజెక్టును తప్పుబట్టడం సరైంది కాదని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఠాకూర్ రఘువీర్ సింగ్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, కౌన్సిలర్ వెన్నం రవీందర్ సుజాత, కాల్వ శ్రీరాంపూర్ మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నునేటి సంపత్, నాయకులు తానిపర్తి మోహన్ రావు, సందీప్ రావు, బైరెడ్డి రాంరెడ్డి, బోయిని రాజమల్లు,సలేంద్ర రాములు ,సర్పంచులు సర్పంచులు పోల్ రాజు కనకమ్మ,శ్రీనివాస్, బోయిన్ శీను,ఒజ్జ సంపత్,సుల్తానాబాద్ అధ్యక్షుడు గుణపతి, ముత్యాల రాజయ్య,మల్లారం నారాయణ,పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్,కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి జట్టు

◆ జాంబియ దేశంలో 26 నుండి మే 2 వరకు పోటీలు

◆ ఆర్జీ-2 రెస్క్యూ జీఎం కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



**యైటింక్లయిన్ కాలనీ ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** జాంబియా దేశంలో ఈ నెల 26 నుంచి ప్రారంభం అయ్యే 14వ అంతర్జాతీయ రెస్క్యూ పోటీలకు సింగరేణి జట్టు వెళ్లుతున్నట్లు జీఎం కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం రెస్క్యూ జీఎం చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెస్క్యూ పోటీల వివరాలను తెలిపారు. ఈ పోటీలకు సింగరేణి జట్టు 24న బయలుదేరి 26 నుండి మే 2 వరకు పోటీల్లో పాల్గొని 5న తిరిగి స్వదేశానికి రానున్నట్లు తెలిపారు. ప్రతి రెండేళ్లకొకసారి జరుగనున్న అంతర్జాతీయ పోటీల్లో గత రెండు దశాబ్దాల నుండి సింగరేణి జట్టు పాల్గొని ఓవరాల్ చాంపియన్ సాధిస్తున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఈసారి కూడా తమ ప్రతిభను కనబరిచి సింగరేణి జెండా ఎగురవేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో 9 దేశాల నుండి 25 జట్లు పాల్గొనున్నాయని తెలిపారు. ఇందులో ఇండియా నుండి 3 జట్లు, జాంబియా-4, కెనడా-4, చైనా-4, ఆస్ట్రేలియా-3, కొలంబియా-3, పోలాండ్-1, ఇండోనేసియా-1, వెస్ట్ ఆఫ్రికా-1 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో ఫైర్ ఫైటింగ్, రోప్ రెస్క్యూ, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ రికవరి, రెస్క్యూ స్కిల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**సింగరేణి రెస్క్యూ జట్టు సభ్యులు వీరే..**

ట్రాన్స్‌లేటర్‌గా జి. రాజేందర్‌రెడ్డి, క్యాప్టెన్ జి. ప్రమోద్‌కుమార్, బ్రీఫింగ్ అధికారిగా నితీష్ కుమార్, జట్టు సభ్యులుగా ఆర్.శ్రీకాంత్, ఎన్. భానుప్రసాద్, జి. రాకేష్, ఎ.శ్యాంకుమార్, సీహెచ్. సాయి కృష్ణలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో రెస్క్యూ ఎస్ఓఎం జీ. రాజేందర్ రెడ్డి, కే. నరేందర్‌రెడ్డి, కే. వీరా రెడ్డి, రెస్క్యూ సభ్యులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ స్థాయిలో కీర్తి చాటాలి

◆సంస్థ డైరెక్టర్ (పీఅండ్‌పీ) కే. వెంకటేశ్వర్లు

**యైటింక్లయిన్ కాలనీ ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** 14వ అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీల్లో సింగరేణి కీర్తిని చాటాలని సంస్థ డైరెక్టర్ (పీఅండ్‌పీ) కే. వెంకటేశ్వర్లు కోరారు. ఈ నెల 26 నుండి జాంబియా దేశంలో ప్రారంభం కానున్న పోటీలకు సింగరేణి జట్టు తరలివెళ్లడానికి సర్వం సిద్ధం అయింది. గురువారం సంస్థ డైరెక్టర్ ఆర్జీ-2 ఏరియా మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో జట్టును సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి రెస్క్యూను అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా ఆధునాతనమైన పరికరాలతో శిక్షణనిచ్చి తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. ఈ పోటీలకు గత 30రోజులుగా వివిధ రకాల శిక్షణను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ పోటీల్లో అన్ని విభాగాల్లో రాణించి ఓవరాల్ చాంపియన్ నిలిచి సింగరేణి పతాకాన్ని ఎగురవేసి ప్రపంచానికిచాటి చెప్పాలన్నారు. ఆయన వెంట రెస్క్యూ జీఎం కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆర్జీ-3, ఎఎల్‌పీ జీఎంలు సుంకర మధుసూధన్ రావు, కొలిపాక నాగేశ్వర్‌రావు, రెస్క్యూ సూపరిండెంటెంట్ జీ.రాజేందర్ రెడ్డి, రెస్క్యూ సభ్యులు ఉన్నారు.



## జిల్లా సాహిత్య చరిత్ర పరిశోధకులకు నివాళులు

**ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాహిత్య, చరిత్ర పరిశోధకులు మలయాశ్రీ, జై శెట్టి రమణయ్యలకు వివేక రచయిత సంఘం నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివేక రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ వాసరవేని పర్శరాములు మాట్లాడుతూ వీరందరి మృతి తీరని లోటని రెండు నెలల కాలంలో సమాజం ఇద్దరు గొప్ప వ్యక్తులను కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర పరిశోధకులను పోగొట్టుకోవడం జరిగిందన్నారు. మలయశ్రీ 1940లో కరీంనగర్ జిల్లా, చెంజర్లలో పుట్టారని, కష్టపడి ఉన్నత విద్యావంతుడిగా ఎదిగిలెక్చరర్‌గా బోధన చేశారని, శాంతిపథం, మానవగీతి, సత్య సూక్తం, రంగులపిట్టలు, ఐరేణికుండలు, చుక్కల లోకం మొదలగు పుస్తకాలు రచించారని, కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర అంశంపై పరిశోధన చేసి పుస్తకం వెలువరించారని, 2026 ఏప్రిల్ 10న మృతిచెందారన్నారు. అదే విధంగా జై శెట్టి రమణయ్య 1939లో జగిత్యాలలో జన్మించారని, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారని, చరిత్ర పై పరిశోధనలు చేసి అనేక చరిత్ర పుస్తకాలను రచించారని, కరీంనగర్ జిల్లా చరిత్ర పై పరిశోధన చేసి పుస్తకం వెలువరించారని, 1996లో పదవి విరమణ పొందారని 2026 మార్చి 27న మృతిచెందారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుంపెన రమేష్, గజభీంకార్ అజయ్, యాసరవేణి రాజు,నక్కసాయి చరణ్,డి. నాగరాజు, దుంపెన హరికన్నలు పాల్గొన్నారు.

## ఐడీఓసీ పెద్దపల్లిలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

### అదనపు కలెక్టర్ డి. వేణు

**పెద్దపల్లి,ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఐడీఓసీ పెద్దపల్లిలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి.వేణు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణు మాట్లాడుతూ సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శ ప్రాయుడయ్యారని కొనియాడారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, అధికారులు, సంఘ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.





## 28న ఛలో విద్యుత్ సౌదా జయప్రదం చేయండి

**యైటింక్లయిన్ కాలనీ ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఈ నెల 28న తలపెట్టిన ఛలో విద్యుత్ సౌదా విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు, గురువారం ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 కృషి భవన్‌లో ఛలో విద్యుత్ సౌదా పోస్టరును ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుండి సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైపోయి సింగరేణి సంస్థకు రావాల్సిన డబ్బులని రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వకపోవడం వల్ల సింగరేణి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఈరోజు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని, కొత్త బొగ్గు బ్లాక్‌లను సింగరేణి కేటాయించకుండా ఉన్న బొగ్గు బ్లాకులను ప్రైవేట్ పెట్టుబడిదారులకు చౌకగా అప్పగింపడం వల్ల సింగరేణి సంస్థ మరింత నష్టాలలో కోరుకుపోతుందన్నారు. వీటిని సరిచేసుకొని మనకు రావాల్సినటువంటి 48 వేల కోట్ల రూపాయలను వెంటనే సింగరేణి సంస్థకు చెల్లించాలని లేనిచో భవిష్యత్తులో అన్ని సంఘాలను కలుపుకొని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 ఏరియా సెక్రెటరీ కుంట ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు బానోత్ వినయ్, వైస్ ప్రెసిడెంట్ సోమారపు వెంకన్న, భూమయ్య, వినేష్, రాజేందర్, రాకేష్ శివ, ఓదెలు పాల్గొన్నారు.

## మంచి మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బహుమతులు



**ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, దుమాల గ్రామంలోని పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో రాజన్నపేట సర్పంచ్ కల్లూరి బాపురెడ్డి, ఉపసర్పంచ్ ఉడుగుల యాదగిరి, వార్డు మెంబర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల, మాజీ సర్పంచ్ ముక్కా శంకర్ పాల్గొనడం జరిగింది. 1 తరగతి నుండి 8వ తరగతి వరకు మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయిన విద్యార్థులకు మాజీ సర్పంచ్ ముక్క శంకర్ బహుమతులు అందించారు. ఉపసర్పంచ్ ఉడుగుల యాదగిరి మజ్జిగ ప్యాకెట్స్ విద్యార్థులకు ఇచ్చారు. సుదామల్ల శ్రీనివాస్ తన కూతురు పుట్టినరోజు సందర్భముగా విద్యార్థులకు అరటిపండ్లు పంచారు. మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా అభినందించారు. 1 తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థులు హేమంత్, ప్రణవి, తనుశ్రీ, భవిష్య, సాత్విక్, నిత్యశ్రీ, కృతిక, ఆదిత్య, నిఖితలు మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. దుమాల గ్రామంలో ప్రధానోపాధ్యాయులు బావికాడి రామచంద్రం మంచి సాధించిన విద్యార్థులను అభినందించారు. 1వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు మొదటి, రెండవ ర్యాంకులకు మాధ లక్ష్మినారాయణ నగదు డబ్బులు అందించారు. గ్రామ సర్పంచ్ సోమారపు శరవింద్ మాట్లాడుతూ పాఠశాలకు కావల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తానని హామి ఇచ్చారు. అదేవిధంగా పాఠశాలకు సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తానన్నారు. ఇట్టి కార్యక్రమంలో హెచ్ఎమ్ తాళ్ళపల్లి శ్రీధర్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌రావు, వేణుమాధవ్, విజయలక్ష్మి, శైలజ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఉపసర్పంచ్ గుర్రపు విశాల్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బైరి జ్యోతి, వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు బి. అరుణ, షేక్ మౌలానా, కే. సతీష్, విమల, సుష్మితలు పాల్గొన్నారు.

## జూలపల్లి నూతన తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన దత్తు ప్రసాద్



**పెద్దపల్లి,ఏప్రిల్ 23(జనంసాక్షి) :** జూలపల్లి మండల తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన దత్తు ప్రసాద్ ను అబ్బాపూర్ గ్రామ సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు, కీచులాటపల్లి సర్పంచ్ మెండే తిరుపతి, ఉప సర్పంచ్ లు ఆవుల శ్రీనివాస్,దాడి మనోహర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ భగీరథ మహర్షికి జిల్లా కలెక్టర్ ఘన నివాళి

### జిల్లా సమీకృత కార్యాలయంలో వేడుకలు

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 23 (జనంసాక్షి);** శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ముందుగా శ్రీ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, కుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు విజయవంతం

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 23 (జనం సాక్షి )**

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు కరీంనగర్ జిల్లాలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గీత భవన్ చౌరస్తా నుంచి కళాభారతి వరకు డప్పు చప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాభారతిలో భారీ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలడుగు సుధాకర్, జిల్లా అధ్యక్షులు యు. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా మున్సిపల్ కార్మికులతో 2001 నుంచి తనకు అనుబంధం ఉందని తెలిపారు. అప్పటి నుంచి సీఐటీయూ పిలుపులకు స్పందిస్తూ కార్మికులు హక్కుల కోసం పోరాడి రూ. 1,250 జీతం నుంచి రూ. 16,600 వరకు పెంపు సాధించుకున్నారని గుర్తుచేశారు. ఈరోజు సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను బలహీనపరిచే లేబర్ కోడ్స్ అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. వాటి రద్దు కోసం పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు కేవలం ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండా రాజకీయంగా కూడా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కనీస వేతనం రూ. 26,000 సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలని కోరారు. భవిష్యత్తులో జరిగే ప్రతి కార్మిక ఉద్యమంలో ఐక్యతను ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మహిళా రాష్ట్ర కన్వీనర్ ముక్కెర బుజ్జమ్మ, రాష్ట్ర కార్యదర్శులు ఆకుల వెంకటేష్, సావనపెల్లి వెంకటస్వామి, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్, జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపెల్లి పోచయ్య, నగర అధ్యక్షులు మల్లేశం, ప్రధాన







కార్యదర్శి శ్యామ్ సుందర్, దాసరి రాజమల్లయ్య, హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గోదావరిఖని డిపోలో రెండో రోజు సమ్మె..

### ఆర్టీసీ విలీనంపై కార్మికుల ఆందోళన

**గోదావరిఖని, జనంసాక్షి:**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న డిమాండ్‌తో కొనసాగుతున్న సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గురువారం గోదావరి ఖని డిపోలో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. డిపో ఆవరణలో కూడి నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయడం అత్యవసరమని అన్నారు. అందువల్ల ఈ విధానాలను వెంటనే రద్దు చేసి, ఆర్టీసీ ద్వారానే బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల జీతభత్యాలను సవరించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అవుట్సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, ప్రభుత్వమే కొత్త బస్సులను కొనుగోలు చేసి సంస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్మికుల హక్కులు కాపాడకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో గోదావరిఖని డిపోకు చెందిన కార్మికులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యంగా తమ డిమాండ్లను వినిపించారు.

# పశు వైద్యశాలలో కుక్క కాటుకు అందుబాటులో లేని వైద్యం

◆ప్రైవేటు డాక్టర్లను ఆశ్రయించాలన్న వైద్యుడు

◆ఇటువంటి వైద్యులపై చర్యలు తీసుకోవాలి.. రైతు రాజిరెడ్డి

**గంభీరావుపేట ఏప్రిల్ 23 (జనంసాక్షి);**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో పశు వైద్యశాలలో సరైన మందు లేక ప్రవేట్ మందుల షాపులకు వెళ్లి మందులు తీసుకువచుకుంటే పశువులకు ఇంజక్షన్ వేస్తామంటూ చెపుతున్న ఘటన చోటుచేసుకుంది,వివరాల్లోకెళ్తే రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల పశువైద్యశాలలో ఐదు రోజుల క్రితం దమ్మనపెట్టకు చెందిన రాజిరెడ్డి అనే రైతు పశువుకు కుక్క కరవడంతో ఆ రైతు సంబంధిత మండల పశు అధికారిని సంప్రదించగా నేను డ్యూటీ లో లేను, అక్కడ సంబంధించిన ప్రైవేటు ఒక వ్యక్తి ఉంటాడు అతనికి ఫోన్ చేయండి అని చెప్పగా ఆ రైతు హడావిడిగా అతనికి ఫోన్ చేసి మాట్లాడగానే నా వద్ద ఎలాంటి మోటర్ సైకిల్ లేదు మీరు బండి తీసుకొని వస్తే నేను వస్తానంటూ తెలిపారు. ఆ వెంటనే రైతు బండి పంపించి పశువుకు ఇంజక్షన్ ఇవ్వాలని తెలపగా పశు హాస్పిటల్లో కుక్క కరిచినందుకు,రాబిట్ కు సంబంధించిన ఇంజక్షన్లు లేవని ప్రవేట్ మెడికల్ లో ఇంజక్షన్ కొనుగోలు చేసుకోవాలని తెలిపారు ఆ రైతు ఎటు తోయని పరిస్థితిలో ఎంత ఖర్చైనా ఇంజక్షన్ ఇవ్వాలని అన్నారు 185 రూపాయలు దొరికే ఇంజక్షన్ 450 రూపాయలు వస్తుందని తెలుపగానే ఆ రైతు రెండు ఇంజక్షన్లు తీసుకొచ్చి ఇప్పించారు వాటికి 900 రూపాయలు రైతు వద్ద వసూలు చేశారు. రైతుతో కలిసి సంబంధిత మండల వైద్యాధికారిని రామంజ దాసును అడగగా హాస్పిటల్లో కుక్కకు సంబంధించిన ఇంజక్షన్లు లేవని ప్రవేట్ మెడికల్ షాపులో కొనుగోలు చేసుకోవాలని మేము వారికి కూడా ఫోన్ చేసిన లేవని తెలిపారు అయినప్పటికీ బయట వ్యక్తుల నుండి వేరే మండలాల్లో ప్రైవేటు వద్ద కొనుగోలు చేసుకుని తీసుకువచ్చిన పశువుకు ఇంజక్షన్ ఇప్పించినప్పటికీ సంబంధిత జిల్లా అధికారిని వివరణ కోరగా మండల వైద్యాధికారి ఇంజక్షన్లు కోసం మాకు ఎప్పుడూ చెప్పలేదని , మా దృష్టికి తీసుకు రాలేదని, గత సంవత్సరం నుండి మా వద్ద స్టాకు ఉన్నాయని తెలిపారు. కానీ అప్పటికైనా ఇంజక్షన్లు ఉన్నప్పటికీ మాట మార్చి జనం సాక్షి విలేకర్ ఎందుకు స్టాక్ లేవని అడగగా జిల్లా అధికారి ఫోన్ చేసి తెలిపినప్పటికీ మా వద్ద ఇంజక్షన్లు ఉన్నాయి ఇస్తామని తెలిపారు, దీనిపై అధికారులు వెంటనే ఇలాంటి వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని ఆ రైతు కోరుతున్నారు. మండలంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్న ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి ఇప్పటికైనా జిల్లా అధికారులు ఇలాంటి ప్రైవేట్ మెడికల్ షాపులను ప్రభుత్వ డాక్టర్లకు సంబంధాలతో నడిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు, ఆ రైతు ఇప్పటికైనా డాక్టర్ తీరును రైతు వ్యతిరేకిస్తూ ఇలాంటి డాక్టర్లపై చర్యలు చేపట్టాలని కోరారు.





# ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో బోధన్ ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలిపిన కార్మికులు

ఎండను సైతం లెక్కచేయకుండా బైఠాయింపు

ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు

**బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి ) :**

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత రెండు రోజుల నుండి నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కొంత ఉద్రిక్తంగా మారింది. బస్టాండ్ ప్రాంగణంలో వంటావార్పు నిర్వహించేందుకు పోలీసు అధికారులు నిరాకరించారు. దాంతో కార్మికులు బస్టాండ్ నుండి ర్యాలీగా నిర్వహించి బోధన్ డిపో ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. యాజమాన్యానికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బోధన్ డిపో జేఏసీ చైర్మెన్ దశరథ్, వైస్ చైర్మెన్ లు సంజీవ్ రెడ్డి, హనీఫ్ లు మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో స్పష్టంగా ఆర్టీసీ కర్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అయితే తమ సమస్యలను పరిష్కరించాలని 40 రోజుల ముందే ప్రభుత్వాన్ని యాజమాన్యానికి నోటీసు అందించి నేడు సమ్మెలో కూర్చోవడం జరిగిందని అయితే ప్రభుత్వం ఐఏఎస్ కమిటీల పేరుతో కాలయాపన చేసి కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్న ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీతో గత ఎన్నికలలో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ కు ఓటు వేసి ప్రభుత్వంను ఏర్పాటు చేసేందుకు మద్దతు తెలపడం జరిగిందని అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికుల పట్ల వివక్ష చూపడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లు స్పందించి ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిఐ 3 గౌసుద్దీన్, ఎల్ హెచ్ తాజుద్దీన్, ఏడీసీలు బిఏ రాణి, డిఏ కుమార్, గాంధీ, రుద్రూరు శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, కృష్ణ, శంకర్, హన్మాండ్లు, కార్మికులు కమల, సంగీత, ఉమ, సావిత్రి, శ్వేత, సవిత, కీర్తి, లావణ్య, రాచు బాయి, అనిత, భాగ్య, నవీన్, క్రాంతి, సందీప్ గౌడ్, నాని బాబు, సురేష్, ఏ ఆర్ కే రెడ్డి, లాల్ రామ్, మల్లిఖార్జున్, ప్రభాకర్, మధుసుదన్, అహ్మద్, తాహెర్, ముకీమ్, బాలా గౌడ్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు. ఈ మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట నారాయణలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బలగాలను మోహరించారు. బోధన్ డిపో మేనేజర్ విశ్వనాథ్, ఎంఎఫ్ వెంకటేశ్వర్లు ప్రైవేటు డ్రైవర్లతో పాటు యాజమాన్యం ఆదేశాల మేరకు నియమించిన తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో అద్దె బస్సులను, ఆర్టీసీ బస్సులను పాక్షికంగా నడిపించారు.







# ఎస్.ఆర్.ఆర్ కళాశాలలో అడ్మిషన్ల పెంపుదలకు అధ్యాపకులు కృషి చేయాలి

## ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 23 (జనంసాక్షి)**
స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్), కరీంనగర్‌లో 2026?27 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ అడ్మిషన్ల పెంపుదలపై ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అధ్యక్షతన అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అధ్యాపకులందరూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులతో నేరుగా సంప్రదింపులు జరిపి, కళాశాలలో ఉన్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సుల వివరాలను తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు ఎస్.ఆర్.ఆర్ కళాశాలను ప్రాధాన్యంగా ఎంచుకునేలా చొరవ చూపాలని కోరారు.దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. రామకృష్ణ మాట్లాడుతూ, అడ్మిషన్ ప్రక్రియ షెడ్యూల్‌ను వివరించారు. మొదటి విడత రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, విద్యార్థులు మే 7 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే ఏప్రిల్ 30 నుండి మే 8 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఉందని తెలిపారు. మే 14న సీట్ల కేటాయింపు జరుగుతుందని, కేటాయింపు పొందిన విద్యార్థులు మే 15 నుండి మే 23 వరకు ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని పేర్కొన్నారు.దోస్త్ అడ్మిషన్ షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను విద్యార్థులకు విస్తృతంగా తెలియజేసి, ఎక్కువ సంఖ్యలో అడ్మిషన్లు సాధించేందుకు కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు.ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్స్ పి.






నితిన్, టి. రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ హర్జ్యోత్ కౌర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలే

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ( జనంసాక్షి ) :
దేశంలో కనికరం లేని పార్టీ ఏదైనా ఉంటే అంటే అది కాంగ్రెస్ పార్టీనేనని, పాకిస్తాన్ తీవ్రవాదుల కంటే ప్రమాదకరమైందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంథనిలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీబావం తెలుపుతూ గురువారం సమ్మె శిభిరాన్ని ఆయన భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి తో కలిసి సందర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు ఎలా ఉంటుందో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటుందో చూస్తున్నామని అన్నారు. ఈనాడు ఇంత ప్రజా చైతన్యం, ఏఐ వస్తున్న క్రమంతో పాటు సోషల్ మీడియా ప్రభావం ఉన్నా కూడా కాంగ్రెస్ పార్టీ అవలీలగా అన్యాయం చేస్తుందన్నారు. కళ్ల ముందే అనేక అక్రమాలు, అన్యాయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆనాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీలో ఉన్నట్లుగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో మానీఫెస్టోలో అనేక అంశాలతో పాటు ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అంశాలను పొందుపర్చి ఈనాడు వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య రాజ్యాంగ బద్ధంగానే పని చేస్తూ మన హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటంలో న్యాయ బద్దత ఉందని, ఈ క్రమంలో పోలీసులు ఇబ్బంది పెట్టడం బాధాకరమని అన్నారు. మట్టిపనికైనా ఇంటోడు కావాలన్నట్లు మనల్ని పాలించే వారు కూడా మనోడే కావాలని ఆయన అన్నారు. ఆనాడు మానీఫెస్టోలో అనేక హమీలు ఇచ్చి మోసం చేసి అధికారంలోకి వచ్చారని, ఇందులో మంథని ఎమ్మెల్యే పాత్ర కీలకమైందన్నారు. దోచుకోవడం...



దాచుకోవడం... అధికారం పోతే కన్నీళ్లు పెట్టుకోవడం కాంగ్రెస్‌కు అలవాటేనని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మూలాలను ఏనాడు మర్చిపోవద్దని, అవి ఎన్నటికి మారవని, వాళ్ల మాటలను నమ్మితే నట్టేట ముంచుతరని ముందే చెప్పారని ఆయన గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**చొప్పదండి, ఏప్రిల్ 23 (జనం సాక్షి ):**
రైతుల సౌకర్యార్థం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు తాము పండించిన పంటలను విక్రయించి మద్దతు ధర పొంది కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు .మండలంలోని కొలిమికుంట,వెదురుగట్ట, భూపాలపట్నం గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రుక్మాపూర్ లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను రైతులు దళారులకమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొంది లాభాలు పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి సౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. రైతులు తీసుకువచ్చే ధాన్యమును వెంట వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ , డీపీఎం ఫైనాన్స్ తిరుపతి , తాసిల్దార్ నవీన్ కుమార్ , ఎంపీడీవో వేణుగోపాల్ రావు, ఆయా గ్రామాల సర్పంచ్ లు కర్రె ప్రేమలత,చుక్కల తిరుపతి ,శ్రీనివాస్, సంజీవ్, ఏపీఎం సంపత్, ఏ ఈ ఓ లు, బీసీలు సమాఖ్య అధ్యక్షురాలు రేగుల సౌమ్య,గ్రామ స్థాయి అధికారులు,గ్రామ సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు,హమాలి, రైతులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే సెలబ్రేషన్స్

**గంభీరావుపేట ఏప్రిల్ 23(జనం సాక్షి)**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేటలో ఆంగ్ల విభాగం అధిపతి డాక్టర్ వై. ఆంజనేయులు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్, కోఆర్డినేటర్, సైకాలజిస్ట్ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రభాకర్ అధ్యక్షతన ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే ఘనంగా సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై. ఆంజనేయులు అసిస్టెంట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ షేక్స్పియర్ ప్రపంచ మహోన్నతమైన కవి, ప్లే రైటర్, గొప్ప నాటక కర్తనీ, సుమారు 39 నాటకాలు, 154 సానెట్సు తదితర గ్రంథాలు రచించాడు. హామ్లెట్, రోమియో ,జూలియట్ ఆయన ప్రసిద్ధ రచనలు. విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని గొప్ప రచయితగా, సమ సమాజాన్ని తీర్చిదిద్దే విధంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. పలువురు విద్యార్థినీ, విద్యార్థులు షేక్స్పియర్ప పి పి టి, ప్రజెంటేషన్ ఇచ్చి పలువురి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రవణ్ కుమార్, వి. వాణి, ఆదివిష్ణు, సుచరణ్, శంకర్ మరియు విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాలూరలో రిపోర్ట్స్ డే తల్లిదండ్రుల సమావేశం

**బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి ) :**
సాలూరు మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం మరియు రిపోర్ట్స్ డే ను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజుష మాట్లాడుతూ, ప్రతి పేరెంట్స్ తో పిల్లల ప్రగతిపై చర్చ నిర్వహించారు. విద్యార్థులు తరచుగా పాఠశాలకు గైర్హాజరు కావడం వల్ల వాళ్ల ప్రగతి పై ప్రభావం చూపుతోందని చెప్పడం జరిగింది. ఈ సంవత్సరం వేసవిలో తీవ్ర ఎండలు ఉంటాయి కాబట్టి విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించడం జరిగింది. ఉదయం పదిగంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు బయట తిరగవద్దని సూచించడం జరిగింది. అట్లాగే ఆహారము మంచినీళ్ళ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. వేసవి సెలవులలో కథలు వార్తాపత్రికలు చదవాలని పిల్లలకు సూచించారు. అట్లాగే మా పాఠశాలలో జరుగుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు పి.ఎం.శ్రీ కార్యక్రమాలు ప్రతి పేరెంట్ గ్రామంలో వివరించాలని ఎన్రోల్మెంట్ పెంచే విధంగా ప్రచారం చేయాలని తల్లిదండ్రులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ కుమార్, శోభారాణి, సుధారాణి, విజయలక్ష్మి, సంగీత్రావు, జ్యోత్స్న ,లక్ష్మి, స్వామి, రాజ్ కుమార్, గంధం సాయిలు, అబ్బయ్య ,అరుణ్ కుమార్, విఠల్ కాంబ్లే, మేడి రవి, అక్షయ్ కుమార్, సంతోష్ యాదవ్, మహేష్, అంజన, వనజ, స్వర్ణ , సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# రైతుకు అండగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం

◆మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం

◆జుబ్లీ నగర్, ఫకీర్ పేట్ వద్ద కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 23 ( జనంసాక్షి) :** రైతులకు ఎల్లప్పుడూ రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పండించిన ధాన్యం అమ్ముకోవడానికి గతంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం జుబ్లీనగర్, ఫకీర్ పేట్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభి రైతులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా తప్ప, తాలు పేరు మీద అనేక ఇబ్బందులు పెట్టారని నరేందర్ రెడ్డి అన్నారు. రైతును రాజును చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పుల ఖజానా అప్పజెప్పినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుకు అండగా నిలవడం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఏపిఎం రామ్మోహన్, సిసి లు కృష్ణ, అశోక్, పిఏసిఎస్ సిఇఒ రమేష్, సర్పంచులు సుద్దాల కమలాకర్, బొద్దుల విజయ లక్ష్మి లక్ష్మణ్, వివో సునీత తదితరులు పాల్గొన్నారు.



## రెండో రోజు కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె ,ఉద్రిక్తత పరిస్థితులు

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 23 ( జనంసాక్షి)** ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగుతుండగా, కరీంనగర్ జిల్లాలో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.సమ్మెకు పలు కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో మద్దతు తెలిపేందుకు ముందుకు వచ్చిన కొందరు సంఘ, పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ఇక ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. అద్దె బస్సులను నడుపుతూ, పోలీసుల బందోబస్తు మధ్య ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. సమ్మె కారణంగా బస్సుల రాకపోకలు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## భయభ్రాంతులకు గురిచేసి.. డబ్బులు వసూలు చేసి. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు



**బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి ) :** ఇసుక టిప్పర్లను అడ్డగించి, డ్రైవర్లను భయ భ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేయ డానికి ప్రయత్నించిన నలుగురు వ్యక్తుల అరెస్ట్ చేసి రెండు ఆటోలు స్వాధీనం చేసు కున్నట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ గురువారం తెలిపారు. బోధన్ పట్టణ పరిధిలోని బాబా గార్డెన్ సమీపంలో ఇసుక టిప్పర్లను అడ్డగించి, డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి నేరానికి ఉపయో గించిన రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 22వ తేదీ సాయంత్రం సుమారు 04:30 గంటల సమయంలో, నిందితులు రెండు ఆటోలలో (TS16UD 0417 - TG16T1362 బాబా గార్డెన్ వద్ద బైపాస్ రోడ్డు నుండి వస్తున్న ఇసుక టిప్పర్ (TG1314)ను వెంబడించి, అడ్డగించారు. డ్రైవర్ డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో, నిందితులు రాళ్లతో టిప్పర్ అద్దాలను పగులగొట్టి, డ్రైవర్‌ను కొట్టి గాయపరిచారన్నారు. అదే సమయంలో వెనుక నుండి వచ్చిన మరో టిప్పర్ (TS7179) డ్రైవర్ ఈ దాడిని తన ఫోన్‌లో వీడియో తీస్తుండగా, నిందితులు అతనిపై కూడా దాడి చేసి,ఫోన్‌ను లాక్కొని పగులగొట్టారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుండి TG 0417 (బజాజ్ ఆటో),TS1362 (బజాజ్ ఆటో) స్వాధీనం చేసుకున్నాము. వారిని రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. ? శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, చట్టవిరుద్ధమైన వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ వెంకటనారాయణ హెచ్చరించారు.

## మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**బోయిన్ పల్లి ఏప్రిల్ 23 (జనం సాక్షి)** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మాజీ డి సి ఎం ఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్ ల తో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్ట పడి పండించిన పంట దళారులకు విక్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యూసుఫ్ మొయినుద్దీన్,ఎంపీడీవో జయశీల,సొసైటీ ప్రత్యేక అధికారి గౌస్,వ్యవసాయ అధికారి ప్రణీత,సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, జంగం అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి బాబు,మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, వేసిరెడ్డి దుర్గారెడ్డి,నాయకులు కొప్పుల నగేష్,అక్కనపల్లి ఉపేందర్,ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్ లు ,నాయకులు ఉన్నారు.

## ఆర్టీసీ బంద్ నేపథ్యంలో గోదావరిఖని,మంథని డిపోలను సందర్శించిన డీసీపీ

- శాంతి భద్రతలపై కట్టుదిట్టమైన చర్యలు - పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి..



**గోదావరిఖని, జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ బంద్ పిలుపు నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని గోదావరిఖని,మంథని ఆర్టీసీ డిపోలను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ఈరోజు పోలీస్ అధికారులతో కలిసి సందర్శిం చారు. ఈ సందర్భంగా డిపోలలో పరిస్థితులను సమీక్షించి,ఆర్టీసీ ఉద్యోగులతో ప్రత్యక్షంగా మాట్లాడారు.డీసీపీ మాట్లాడుతూ సమ్మెను ప్రజాస్వామ్యపరమైన హక్కుగా గౌరవిస్తున్నప్పటికీ అది పూర్తిగా శాంతియుత వాతావరణంలోనే నిర్వహించుకోవాలని సూచించారు.బంద్ సమయంలో ఎటువంటి ఉద్రిక్తతలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలని కోరారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా, అధికారులపై దాడులకు పాల్పడినా అలాంటి వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిపో పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన డీసీపీ, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డిపో,బస్ స్టాండ్ పరిసరాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, అనుమానా స్పద వ్యక్తులు లేదా సంఘటనలపై వెంటనే స్పందించాలని సూచించారు. బంద్ సందర్భంగా ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని, వదంతులను నమ్మకూడదని, ఎటువంటి సమస్యలు గమనించిన వెంటనే పోలీస్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భనలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, మంథని సీఐ బి.రాజు, ఎస్సైరమేష్, ఆర్టీసీ డీఎంలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారుల ఎంపిక

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 23 ( జనం సాక్షి)** పెద్దపల్లి అమర్చంద్ కళ్యాణమండపంలో ఈనెల 22న నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్?7, అండర్?11 చదరంగం పోటీలలో కరీంనగర్‌కు చెందిన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు విశిష్ట ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.అండర్?7 బాలికల విభాగంలో ఎం. సాన్విత, కే. అద్వైత, ఎన్. సాన్విత; బాలుర విభాగంలో శ్రీ హన్సిత్, కే. శ్రేయాన్స్, ఏ. శ్రేయన్స్ ఎంపికయ్యారు. అండర్?11 బాలికల విభాగంలో ఎస్. నేహిత, జి. తన్వి, లక్ష్మీ నందిని; బాలుర విభాగంలో ఎన్. అశ్విన్, జటిన్ సిద్ధార్థ, సహర్ష్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఎంపికైన క్రీడాకారులను గురువారం జ్యోతి నగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీలో వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్, సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, కో-డైరెక్టర్ కంకటి సుజన్ కుమార్, కరీంనగర్ డిస్ట్రిక్ట్ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు, అకాడమీ కోచ్‌లు అభిరామ్, రేవిక్, స్వాతి, శ్రీనిజతో పాటు క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కథలాపూర్ లో ఘనంగా చెలిమెడ లక్ష్మీనరసింహారావు పుట్టినరోజు సంబరాలు

**కథలాపూర్ ఏప్రిల్ 23 (జనం సాక్షి)** కథలాపూర్ మండల కేంద్రంలోని బి ఆర్ ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చెలిమెడ లక్ష్మీనరసింహారావు పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి స్వీట్ పంపిని చేసి టపాసులు పేల్చి లక్ష్మీనరసింహారావుకు బర్డే శుభాకాంక్షలు తెలియజేశారు మండలంలోని నాయకులు గడ్డం భూమారెడ్డి మామిడిపల్లి రవి, వర్దినేని నాగేశ్వరావు కల్లెడ శంకర్ బద్దం మహేందర్ రెడ్డి గోపి పలువురు నాయకులు పాలుగొనడం జరిగింది.

